## సాహిల్ తల్లిదండ్రుల నిరాహార దీక్ష




2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శుక్రవారం 25 సెప్టెంబర్ 2026 | సంపుటి: 10 | సంచిక: 261 | పేజీలు: 8+4 | వెల రూ.5

## నీట్-పీజీ ఫలితాలు వెల్లడి




2

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM



రాష్ట్రంలో వర్ష బీభత్సంపై, జిల్లాల్లో పరిస్థితులపై సీఎం చంద్రబాబు, ఆర్టీజీ సెంటర్ నుంచి అధికారులతో రివ్యూ చేశారు. నదులకు వస్తోన్న ప్రవాహాలను పరిశీలించి, సమర్థ నీటి నిర్వహణతో రిజర్వాయర్లను నింపాలని సూచించారు. జన జీవనానికి ఇబ్బంది రాకుండా చూడాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

# జనజీవనానికి ఇబ్బంది రానివ్వొద్దు

## భారీ వర్షాలపై సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి, మనం ప్రత్యేక ప్రతినిధి:** వర్షాల కారణంగా వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్ని నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కృష్ణా, గోదావరి డెల్టాలోని రిజర్వాయర్లతో పాటు పరిధిలో ఉన్న వివిధ నీటి వనరుల్ని కూడా నింపాలని స్పష్టం చేశారు. రియల్టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఏఐ ఆధారిత సాంకేతికత వినియోగం, డేటా అనలిటిక్స్, ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనే వ్యూహాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్ష ప్రభావంపై సీఎం చర్చించారు. తీవ్ర వాయుగుండం కారణంగా రాష్ట్రంలో గడచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా భూగర్భజలాలు కొంత మేర పెరిగాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రకాశం బ్యారేజి సహా మున్నేరు సహా ఇతర క్యాచ్ మెంట్ ఏరియా నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని అన్నారు. ప్రాజెక్టుల దిగువన ఉన్న అన్ని నీటి వనరుల్లో వర్షపు నీటిని ...మిగతా 2లో

## యువతకు ఉద్యోగాలు కూటమి నైజం.. రౌడీయిజం జగన్ నైజం

### హోం మంత్రి వంగలపూడి అనిత



**అమరావతి,సెప్టెంబర్,24 మనం ప్రత్యేక ప్రతినిధి:** యువతకు ఉద్యోగాలు కూటమి నైజం.. రౌడీయిజం జగన్ నైజమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన విధ్వంసం, చంద్రబాబు నాయుడు గారి అక్రమ అరెస్ట్ వరకు కొనసాగి వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ...2024 ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రాత్మక విజయాన్ని అందించి అధికారం అప్పగించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ రాష్ట్రాభివృద్ధికి, సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. చట్టబద్ధ పాలనతో రాష్ట్రంలో క్రైమ్ రేటును 14 శాతం తగ్గించామని, శాంతిభద్రతలు అదుపులో ఉండటం వల్లే వేల కోట్ల రూపాయల పెట్టుబడులు, లక్షల ఉద్యోగాలు రాష్ట్రానికి తరలివస్తున్నాయని స్పష్టం చేశారు.యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మంత్రి నారా లోకేష్ గారు అన్ని న్యాయపరమైన అడ్డంకులను ఛేదించి ...మిగతా 2లో

### స్లీపర్ బస్సులో మంటలు
## 9 మంది సజీవదహనం
ప్రధాని దిగ్భ్రాంతి.. రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన


6

## పారిశ్రామికవేత్తల్లో స్ఫూర్తి... ఆంధ్రప్రదేశ్‌కు ఖ్యాతి తెచ్చేలా విశాఖ పెట్టుబడుల సదస్సు

- ఎంఎస్ఎంఈలకు ప్రాధాన్యతనిచ్చేలా 5 ప్రాంతాల్లో 5 రీజినల్ కాన్ఫరెన్సులు
- పార్టనర్షిప్ సమ్మిట్-2026 సన్నాహకాలపై సమీక్షలో సీఎం
- 30 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకూ శంకుస్థాపన

2

## పవన్ కళ్యాణ్‌తో వంగవీటి రాధాకృష్ణ ఆత్మీయ భేటీ



**అమరావతి, సెప్టెంబర్,24,(మనం ప్రత్యేక ప్రతినిధి):**జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని వంగవీటి మోహనరంగా కుమారుడు, మాజీ శాసనసభ్యులు వంగవీటి రాధాకృష్ణ గురువారం సాయంత్రం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వీరి ఇరువురి మధ్య సుదీర్ఘకాలంగా ఉన్న స్నేహం నేపథ్యంలో జరిగిన ఈ ఆత్మీయ భేటీలో, గతంలో ప్రజారాజ్యం పార్టీలో కలిసి పనిచేసిన రోజులను, 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రచారంలో చోటుచేసుకున్న పలు అంశాలను వారు గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా సమకాలీన రాజకీయ అంశాలతో పాటు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ఇరువురూ సుదీర్ఘంగా చర్చించారు. అలాగే, పవన్ కళ్యాణ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న శాఖల్లో తీసుకొస్తున్న మార్పులు, చేపడుతున్న సంస్కరణలను వంగవీటి రాధాకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.



నిరసన వ్యక్తం చేస్తే రౌడీషీట్లు తెరుస్తామనడం
## చట్టవిరుద్ధం

రాజకీయ కేసులతో రౌడీషీట్ తెరుస్తారా..?

చంద్రబాబు, లోకేశ్ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట

అంబటి రాంబాబు ఆగ్రహం

**గుంటూరు,సెప్టెంబర్,24,(మనం న్యూస్):** డీఎస్సీ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణ జరిపించాలని, అలాగే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి, ...మిగతా 2లో

## మత్స్యకారులు క్షేమంగా తిరిగివచ్చే వరకు నిరంతర పర్యవేక్షణ

- గోపాల్పూర్ పోర్టులోకి రాష్ట్రానికి చెందిన 51 యాంత్రిక పడవలకు అనుమతి
- అరయపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్కు సురక్షితంగా చేరిన 16 పడవలు
- ఒడిశా అధికారులతో సమన్వయం చేసుకుంటూ రక్షణ చర్యలు
- పడవల యజమానులతో నిత్యం సంప్రదింపులు జరపాలని అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం





**అమరావతి, సెప్టెంబరు 24,(మనం ప్రత్యేక ప్రతినిధి):** బంగాళాఖాతంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన మత్స్యకారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఒడిశా మత్స్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ చేపల వేట పడవలకు ఆశ్రయం కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పరిస్థితులు అనుకూలించి, మత్స్యకారులు తమ ప్రాంతాలకు ...మిగతా 2లో

## డోంట్ మిస్ ఎ బీట్‌తో గుండె ఆరోగ్యంపై ప్రజల్లో చైతన్యం

29న కర్నూలులో ప్రపంచ హృదయ దినోత్సవ వేడుకలు

ప్రచార పోస్టర్లు ఆవిష్కరించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్




**అమరావతి,సెప్టెంబర్, 24,(మనం ప్రత్యేక ప్రతినిధి):** ప్రపంచ హార్ట్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 29 వ తేదీన కర్నూలులోని ఎ-క్యాంప్లో ఉన్న కర్నూల్ హెల్త్ క్లబ్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికారిక ప్రచార పోస్టర్ను గురువారం విజయవాడలోని చీఫ్ సెక్రటరీ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కర్నూల్ హార్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జి. సాయి ప్రసాద్, కర్నూల్ హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి, ప్రముఖ కార్డియాలజిస్ట్, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్,యండి, డియం, యూనివర్సిటీ రిజిస్ట్రార్ టి. సాయి సుధీర్ ల తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కర్నూల్ హార్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ జి. సాయి ప్రసాద్ మాట్లాడుతూ... మారుతున్న ఆధునిక జీవనశైలి, పెరుగుతున్న పని ఒత్తిడి తదితర కారణాలతో గుండె ...మిగతా 2లో

## బీసీ బిడ్డలను కంటికి రెప్పలా కాపాడాలి

- మంత్రి సవిత ఆదేశం



**తాడేపల్లి/అమరావతి,సెప్టెంబర్,24 (మనం ప్రత్యేక ప్రతినిధి):** ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో బీసీ సంక్షేమ శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని, బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకునే విద్యార్థులను కంటికి రెప్పలా చూసుకోవాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా హాస్టళ్లు, గురుకులాల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, విద్యార్థులు అస్వస్థతకు గురైతే తక్షణమే మెరుగైన వైద్యమందించాలని స్పష్టంచేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, పలువురు కార్పొరేషన్ల చైర్మన్లతో మంత్రి సవిత గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణకు మంత్రి సవిత కీలక ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో బీసీ సంక్షేమ శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల సిబ్బంది నిత్యం అందుబాటులో ...మిగతా 2లో



## ఏపీ కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలి

కరువు సమస్యలపై సమరశంఖం

కూటమి సర్కార్ వైఫల్యాలపై అన్ని పక్షాల ఐక్య పోరాటం

ప్రజా సమస్యలపై వైయస్సార్సీపీతో కలిసి పోరాడేందుకు సిద్ధం

సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఈశ్వరయ్య

**తాడేపల్లి,సెప్టెంబర్,24,(మనం ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితుల నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 26న విజయవాడలో నిర్వహించనున్న అఖిలపక్ష రౌండ్ టేబుల్ ...మిగతా 2లో

## సర్‌పై ఎన్నికల సంఘంలో విభేదాల వ్యవహారం

### జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

రాహుల్ గాంధీ డిమాండ్



2

### 48 గంటల్లో రిజైన్ చేయాల్సిందే

- లేని పక్షంలో జంతర్ మంతర్ 2.0 చేపడతాం
- సీజేపీ ప్రతినిధులు దీప్కే, సౌరవ్ దాస్





## చంద్రబాబు కుట్రలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి

### స్థానిక ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను నిలబెట్టాలి

- ఈ ఎంపికలో మన నిర్ణయాలు రేపు ఎన్నికల్లో ఉపయోగపడాలి
- పార్టీలో అందరితో మాట్లాడి అభిప్రాయాలు తీసుకోండి
- ఆ తర్వాతే అభ్యర్థుల జాబితా రూపొందించండి
- సమావేశంలో వైయస్ జగన్ స్పష్టీకరణ

**తాడేపల్లి,24,సెప్టెంబర్,(మనం ప్రతినిధి):** రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలీసుల బలం, అడ్డదారుల్లో గెలిచేందుకు సీఎం చంద్రబాబు ఎన్నో కుట్రలు చేస్తారని, వాటన్నింటినీ ఎదుర్కొనేందుకు అంతా సిద్ధంగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్రెడ్డి పిలుపునిచ్చారు. వైయస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ల సమావేశంలో మాట్లాడిన ఆయన, ఈ ఎన్నికల్లో పార్టీ నుంచి బలమైన అభ్యర్థులను రంగంలోకి దించాలని, వీలైనంత వేగంగా ...మిగతా 2లో

### ఇతర దేశాల శాటిలైట్లను బ్లాక్ చేస్తున్న బ్రిటన్

వెల్లడించిన ఆ దేశ వాయుసేన చీఫ్



2




## నీట్-పీజీ ఫలితాలు వెల్లడి

**ఢిల్లీ, సెప్టెంబర్ 24:** దేశ వ్యాప్తంగా వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను గురువారం మధ్యాహ్నం నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ విడుదల చేసింది. ఆగస్టు 30న నిర్వహించిన నీట్- పీజీ పరీక్షకు 2,63,544 మంది హాజరు కాగా.. సెప్టెంబర్ 5న జైపుర్‌లో నిర్వహించిన ఈ పరీక్షకు 2416మంది అభ్యర్థులు హాజరైనట్లు బోర్డు తెలిపింది. అభ్యర్థుల అప్లికేషన్ సీక్వెన్స్ నంబర్, రోల్ నంబర్, సాధించిన స్కోరు, నీట్ పీజీ 2026 ర్యాంకులతో కూడిన ప్రత్యేక జాబితాతో పాటు కటాఫ్ స్కోరును కూడా విడుదల చేసింది. అక్టోబర్ 1నుంచి అభ్యర్థులు తమ స్కోరు కార్డులను అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

## ఇతర దేశాల శాటిలైట్లను బ్లాక్ చేస్తున్న బ్రిటన్

**లండన్, సెప్టెంబర్ 24:** అంతరిక్షంలో ఆధిపత్యం కోసం ఏ దేశానికి ఆదేశం వ్యూహాత్మక కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఆయా కార్యకలాపాలు ముఖ్యంగా అంతరిక్షంలోనే నిర్వహిస్తున్నాయి. అంతరిక్షంలో ఆయుధాలను మోహరించినట్లు ఇటీవల అమెరికా తొలిసారి అంగీకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాను ఏం తక్కువ కాదన్నట్టు బ్రిటన్ కూడా మరో నిజం వెల్లడించింది. ఇతర దేశాలకు చెందిన ఉపగ్రహాలను జామింగ్ లేదా బ్లాక్ చేస్తున్నట్లు తెలియజేసింది. అయితే, ఇది కేవలం ఆత్మరక్షణ కోసమేనని పేర్కొంది. ఈ మేరకు బ్రిటన్ పబ్లిక్ సర్వీస్ బ్రాడ్ క్యాస్టర్ బీబీసీ వెల్లడించింది. భూ ఉపరితలం నుంచే ప్రత్యేక సాంకేతికతను ఉపయోగించి శత్రుదేశానికి చెందిన ఉపగ్రహాలు సమాచారాన్ని సేకరించకుండా ఆ దేశ వాయుసేన.. ది రాయల్ ఎయిర్ ఫోర్స్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపింది. ముఖ్యంగా అణు నిల్వలు, అణు జలాంతర్గాముల కదలికలు, దేశ రక్షణతో సంబంధమున్న సున్నితమైన ప్రదేశాలకు సంబంధించిన సమాచారం శత్రు శాటిలైట్లకు చిక్కకుండా యూకే చర్యలు తీసుకుంటున్నట్టు ప్రకటించింది. తమ ఉపగ్రహాలను రక్షించుకోవడానికి ది రాయల్ ఎయిర్‌ఫోర్స్ (రాఫ్) తాజాగా మిలిటరీ స్పేస్ స్క్వాడ్రన్ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా రాఫ్ అధిపతి మాట్లాడుతూ.. అంతరిక్షంలోనూ శత్రువుల నుంచి తీవ్ర ముప్పు ఉందని వ్యాఖ్యానించారు.

## ఏపీ కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలి

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి హాజరు కావాల్సిందిగా వైయస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డిని సీపీఐ ప్రతినిధి బృందం స్వయంగా ఆహ్వానించింది. గురువారం తాడేపల్లిలోని వైయస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఈశ్వరయ్య, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి తదితరులు వైఎస్ జగన్తో సమావేశమయ్యారు.

ఈ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఈశ్వరయ్య.. రాష్ట్రంలో నెలకొన్న కరువు, ఓటర్ల జాబితా సవరణ (సర్) అక్రమాలు, ప్రజా సమస్యలపై వైయస్సార్సీపీతో కలిసి ఉమ్మడి పోరాటాలు సాగించడానికి తాము సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ఇందుకు వైఎస్ జగన్మోహన్రెడ్డి కూడా పూర్తి సానుకూలత, సంసిద్ధత వ్యక్తం చేశారని ఈశ్వరయ్య స్పష్టం చేశారు.

**26న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం - వైఎస్ జగన్కు ఆహ్వానం:**

భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) నేతృత్వంలో సెప్టెంబర్ 26వ తేదీన రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నాం. కూటమి ప్రభుత్వం మినహా మిగిలిన అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలను ఏకం చేసి ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఒత్తిడి తేవాలని నిర్ణయించాం. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి గారిని మా ప్రతినిధి బృందం కలిసి, 26న జరిగే సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించాం. భవిష్యత్తులో ప్రజా సమస్యలపై కలిసికట్టుగా పోరాటం చేయడానికి వైఎస్ జగన్ తమ సంసిద్ధతను, సుముఖతను స్పష్టంగా వ్యక్తం చేశారు.

### పారిశ్రామికవేత్తల్లో స్ఫూర్తి... ఆంధ్రప్రదేశ్‌కు ఖ్యాతి

# తెచ్చేలా విశాఖ పెట్టుబడుల సదస్సు

**30 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకూ శంకుస్థాపన**



**అమరావతి, సెప్టెంబర్ 24,(మనం ప్రత్యేక ప్రతినిధి):** పార్టనర్షిప్ సమ్మిట్-2026కు సన్నాహకంగా రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో 5 రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, అనంతపురం, తిరుపతిలో రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించాలని, ప్రాజెక్టులకు ఎంవోయూలు జరగాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఆయా ప్రాంతాల ప్రత్యేకతలు, పెట్టుబడి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని చర్చలు నిర్వహించాలన్నారు. విశాఖపట్నంలో నవంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించనున్న 31వ సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్-2026కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సన్నాహక కార్యక్రమాలపై గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. భాగస్వామ్య సదస్సు కేవలం ఎంవోయూల కోసం కాకుండా... ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తినింపేలా, ఏపీ బ్రాండింగ్ మరింత పెరిగేలా నిర్వహించాలన్నారు. అలాగే పెట్టుబడులతో పాటు... మిగిలిన అంశాలపైనా సదస్సులో చర్చ జరగాలన్నారు.

**ఎంట్రప్రెన్యూర్లను తీర్చిదిద్దేలా పాఠ్యాంశాలు**

ప్రతీ రీజినల్ కాన్ఫరెన్స్లో ఎంఎస్ఎంఈ షోకేస్ పేరుతో ప్రోత్సాహం అందించాలని సీఎం సూచించారు. అలాగే, స్టార్టప్లకు పెట్టుబడులు పెట్టేవారి కోసం వినూత్నంగా షార్క్ ట్యాంక్ అనే విధానాన్ని ప్రవేశ పెట్టాలని సీఎం స్పష్టం చేశారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్లను రీజినల్ కాన్ఫరెన్సులకు అనుసంధానం చేయాలన్నారు. భాగస్వామ్య సదస్సుకు ముందుగానే మరో 30 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన జరిగేలా కార్యాచరణ చేపట్టాలని చెప్పారు. పాఠశాల విద్యార్థులు స్టార్టప్ ఆలోచనలు చేసేలా రీజినల్ సమ్మిట్ ఉండాలని, 7వ తరగతి నుంచే విద్యార్థులకు ప్రేరణ ఇచ్చేలా ఎంట్రప్రెన్యూర్షిప్కు సంబంధించి పాఠ్యాంశాలు ప్రవేశ పెట్టాలన్నారు. 'ఇన్వెస్ట్ కడప' తరహా కార్యక్రమాలను అన్ని జిల్లాల్లోనూ నిర్వహిస్తే మరింతగా పెట్టుబడులను ఆకర్షించ వచ్చన్నారు.

**వేగంగా పెట్టుబడుల గ్రౌండింగ్**

సమ్మిట్కు ముందు రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న పెట్టుబడుల ప్రతిపాదనలను వేగంగా కార్యరూపంలోకి తీసుకురావడం, గతంలో కుదిరిన ఎంవోయూలను కన్వర్ట్ చేయడం, ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులను గ్రౌండ్ చేయడం, రీజినల్ కాన్ఫరెన్సుల ద్వారా కొత్త పెట్టుబడులను ఆకర్షించడం వంటి అంశాలపై సమీక్షలో ప్రధానంగా చర్చించారు. అలాగే, ప్రస్తుత పెట్టుబడుల స్థితిగతులను ముఖ్యమంత్రి పరిశీలించారు. అక్టోబర్ చివరి నాటికి పెట్టుబడి ప్రతిపాదనల్లో 80 శాతం కన్వర్ట్ చేయాలని..., కన్వర్ట్ అయిన ప్రాజెక్టుల్లో 75 శాతం గ్రౌండింగ్ చేసే లక్ష్యంతో శాఖలు పనిచేయాలని సీఎం నిర్దేశించారు. 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో రూ.22.57 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 714 ప్రాజెక్టులకు ఎంవోయూలు కుదిరాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వీటిలో రూ.16.6 లక్షల కోట్ల విలువైన 473 ప్రాజెక్టులు కన్వర్ట్ అయ్యాయని చెప్పారు. కన్వర్ట్ అయిన ప్రాజెక్టుల్లో ఇప్పటికే 247 ప్రాజెక్టులు గ్రౌండింగ్ జరిగినట్టు తెలిపారు.

**రీజినల్ కాన్ఫరెన్స్ షెడ్యూల్**

అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 26 వరకు రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించనున్నారు. ముందుగా విశాఖపట్నంలో అక్టోబర్ 7న ఏఐ, డేటా సెంటర్లు, ఐటీ - ఫిన్ టెక్, సెమికండక్టర్స్, జీసీసీ, ఫార్మా, మెడ్ టెక్ ఫోకస్గా కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. అక్టోబర్ 12న కాకినాడలో మారిటైమ్, షిప్ బిల్డింగ్, కెమికల్స్, గ్రీన్ హైడ్రోజన్, అమోనియా, ఆక్వా ఎక్స్పోర్ట్స్ ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలకు ప్రయార్టీ ఇవ్వనున్నారు. ఇక అక్టోబర్ 16న గుంటూరులో గవర్నెన్స్, క్యాపిటల్ సిటీ డెవలప్మెంట్, అర్బన్ ఇన్ఫ్రా, క్వాంటం వ్యాలీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్పైన... అక్టోబర్ 23న అనంతపురంలో ఏరో స్పేస్, డిఫెన్స్, ఆటోమోటివ్, నేచురల్ ఫార్మింగ్, హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, రిన్యువబుల్ ఎనర్జీ.... అక్టోబర్ 26న తిరుపతిలో టూరిజం, హాస్పటాలిటీ, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్, సెమి కండక్టర్, అడ్వాన్స్డ్ మెటీరియల్స్, ఆటోమోటివ్, స్పేస్, ఫుట్ వేర్ రంగాలకు ప్రాధాన్యతనిస్తూ రీజినల్ కాన్ఫరెన్సులు జరగున్నాయి.

## జనజీవనానికి ఇబ్బంది రానివ్వొద్దు

(మొదటి పేజీ తరువాయి)

నిల్వ చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. అవసరమైన చోట మోటార్లను వాడి నీటిని లిఫ్ట్ చేయాలని స్పష్టం చేశారు. గోదావరి నుంచి వస్తున్న ప్రవాహాల ద్వారా 24 టీఎంసీల నీటిని ఏలేరు రిజర్వాయర్ నింపాలని స్పష్టం చేశారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకూ నీటి వనరుల్లోకి నీటిని పంపాలన్నారు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో వర్షాలు అధికంగా నమోదు అయ్యాయని అధికారులు వివరించారు. ముఖ్యంగా విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, మన్యం, కాకినాడ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ సహా వివిధ జిల్లాల్లో తీవ్ర వర్ష ప్రభావం కనిపించిందని తెలిపారు.

**గోదావరి, కృష్ణా, నాగావళి, వంశధార బేసిన్లపై ప్రత్యేక దృష్టి**

ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాలు, గాలుల తీవ్రత, నదులు-వాగుల్లో పెరుగుతున్న ప్రవాహాలు, రిజర్వాయర్లలోకి చేరుతున్న వరద నీరు, రాబోయే రోజుల్లో అంచనా వేసిన వర్షపాతంపై ముఖ్యమంత్రి సమీక్షించారు. తాజా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల ప్రభావంతో గోదావరి బేసిన్లోని శబరి, ఇంద్రావతి, ఏలేరు, తాండవ, ఎర్రకాల్వ, పంపా, మేఘాద్రిగడ్డ తదితర రిజర్వాయర్లకు భారీగా వరద నీరు చేరుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఏలేరు రిజర్వాయర్కు 21,200-26,500 క్యూసెక్కుల మేర, తాండవకు 6,000-7,500 క్యూసెక్కులు, మేఘాద్రిగడ్డకు 2,400-3,000 క్యూసెక్కులు, పంపాకు 3,100-3,875 క్యూసెక్కులు వరకు ఇన్ఫ్లో వస్తుందని అంచనా వేస్తున్నారు. ఉత్తర కోస్తా రిజర్వాయర్లకు కూడా రాబోయే రోజుల్లో ఇన్ఫ్లో గణనీయంగా పెరుగుతుందని వెల్లడించారు. నాగావళి-వంశధార బేసిన్లలో వర్షాల ప్రభావంతో ప్రవాహాలు పెరగనున్నాయని వివరించారు. గొట్టా బ్యారేజీకి సెప్టెంబర్ 25 ఉదయం నాటికి వార్నింగ్ లెవల్-1 చేరుకునే అవకాశం ఉందని అంచనా వేశారు. భద్రాచలం వద్ద సెప్టెంబర్ 26 మధ్యాహ్నానికి వార్నింగ్ లెవల్-1, అదే రోజు రాత్రికి వార్నింగ్ లెవల్-2 దాటే అవకాశం ఉందని తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 27 ఉదయం వార్నింగ్ లెవల్-1, సాయంత్రం వార్నింగ్ లెవల్-2 దాటే అవకాశం ఉందని అంచనా వేశారు. శబరి నదిపై కుంటా వద్ద సెప్టెంబర్ 26 ఉదయానికి వార్నింగ్ స్థాయికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

**ప్రకృతి వ్యవసాయం చేయాలి...**

ఎల్నినో వంటి వాతావరణ పరిస్థితులను మార్చడం సాధ్యం కాకపోయినా.. వాటి ప్రభావాన్ని తగ్గించేలా అంతర్గత పరిస్థితులను మార్చుకోవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. భూసారాన్ని పెంచడం, సాయిల్ టెస్టింగ్ ఆధారంగా ప్రత్యామ్నాయ పంటలను సూచించడం, బయోచార్, ప్రకృతి వ్యవసాయం వంటి విధానాల ద్వారా ఎల్నినో ప్రభావాన్ని కొంతమేర తగ్గించవచ్చని తెలిపారు. ఈ విధానాన్ని రాష్ట్రంలో పైలట్గా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి వ్యవసాయ రంగానికి అవసరమైన సూచనలు అందించేలా సాంకేతికతను వినియోగించుకోవాలని సీఎం సూచించారు. వ్యవసాయానికి సంబంధించిన సమాచారంతో పాటు సాగునీటి లభ్యత, రిజర్వాయర్ల పరిస్థితి తదితర వివరాల డేటా పొందుపరచాలని ఆదేశించారు. అక్టోబరు 2 తేదీన ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు శంకుస్థాపన చేయనున్నామని, అదే రోజు రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు.

## మత్స్యకారులు క్షేమంగా తిరిగివచ్చే వరకు నిరంతర పర్యవేక్షణ

(మొదటి పేజీ తరువాయి)

క్షేమంగా తిరిగివచ్చే వరకు తీరప్రాంత జిల్లాల మత్స్యశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఒడిశా అధికారుల నుంచి అందిన సమాచారం ప్రకారం ఆంధ్రప్రదేశ్కు చెందిన 51 యాంత్రిక పడవలను గోపాల్పూర్ పోర్టులోకి అనుమతించినట్లు మంత్రి వివరించారు. వీటిలో ఇంజిన్ పనిచేయకుండా నిలిచిపోయిన ఒక పడవను లాగి తీసుకువచ్చి, పోర్టులో సురక్షితంగా లంగరు వేసినట్లు తెలిపారు. అరయపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్కు మరో 16 పడవలు క్షేమంగా చేరుకున్నాయని పేర్కొన్నారు. పడవలను గోపాల్పూర్ పోర్టులోకి అనుమతించేందుకు ఒడిశా మత్స్యశాఖ అక్కడి కలెక్టర్, పోర్టు అధికారులకు సమాచారం అందించి సమన్వయం చేసిందని వివరించారు. మత్స్యశాఖ కమీషనర్, అధికారులు నివేదించిన రెండు పడవలతోపాటు వాటిలోని సిబ్బంది కూడా గోపాల్పూర్లో సురక్షితంగా ఉన్నారని మంత్రి తెలిపారు. సంబంధిత కుటుంబాలను సంప్రదించి ఈ సమాచారాన్ని తెలియజేసినట్లు పేర్కొన్నారు. మత్స్యకారుల క్షేమ సమాచారాన్ని కుటుంబాలకు ఎప్పటికప్పుడు చేరవేసి, వారికి భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. పడవల యజమానులతో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరపాలి. ప్రతి పడవ పరిస్థితిని తెలుసుకుంటూ అవసరమైన సహాయానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలి. సముద్రంలో ప్రతికూల పరిస్థితులు తొలగిన తర్వాతే ఆయా పడవలు తమకు సంబంధించిన ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లకు క్షేమంగా చేరుకునేలా పర్యవేక్షించాలి అని మంత్రి స్పష్టం చేశారు.

## యువతకు ఉద్యోగాలు కూటమి నైజం.. రౌడీయిజం జగన్ నైజం

(మొదటి పేజీ తరువాయి)

16,000 మందికిపైగా ఉపాధ్యాయ ఉద్యోగాలను అత్యంత పారదర్శకంగా భర్తీ చేశారని హోం మంత్రి కొనియాడారు. రిక్రూట్మెంట్ విధానంపై లోకేష్ గారు స్వయంగా అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి వివరాలు వెల్లడించడమే కాకుండా బహిరంగ చర్చకు రావాలని మూడుసార్లు సవాల్ విసిరినా జగన్కు అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేకపోయిందన్నారు. కడపలో స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన 350 మందికి పైగా క్రీడాకారులు తమ సర్టిఫికెట్లు, టెట్ అర్హత పత్రాలతో విజయవాడలోని శాప్ కార్యాలయానికి వచ్చి రక్షణ కోరితే, తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్లో 50-60 కార్లలో వచ్చిన వైసీపీ రౌడీ మూకలు వారిపై రాళ్లు, గాజు సీసాలు, ఇనుప రాడ్లతో పాశవిక దాడికి దిగడం దుర్మార్గమన్నారు.

శాప్ కార్యాలయం వద్ద నిరసనల పేరుతో వీరంగం సృష్టించిన వారిలో 60 నుంచి 70 శాతం మంది నేరచరిత్ర కలిగిన రౌడీషీటర్లు, పోక్సో కేసులు, హత్యాయత్నం కేసులు, బ్లేడ్ బ్యాచ్లతో సంబంధాలు ఉన్నవారేనని ఫోటోలు, కేసుల వివరాలతో సహా హోం మంత్రి మీడియా ముందు బట్టబయలు చేశారు. మాజీ ఎమ్మెల్యేలపై 37 క్రిమినల్ కేసులు ఉన్నాయని, టీడీపీ కేంద్ర కార్యాలయంపై గతంలో దాడి చేసిన విద్యార్థి విభాగం నేత చైతన్యపై 22 కేసులు, కంచికచర్లకు చెందిన రౌడీషీటర్ సురేష్ బాబుపై మర్డర్ కేసులు, మరికొందరిపై 13-14 కేసులు, తీవ్రమైన పోక్సో కేసులు ఉన్నాయని ఆధారాలు ప్రదర్శించారు. ఇటువంటి నేరగాళ్లను 'జెన్జీ' యువత అంటూ అమాయక విద్యార్థులుగా చిత్రీకరిస్తూ, 'వి స్టాండ్ విత్ రాజ్ పాల్' అంటూ పోస్టర్లు వేసుకుని గవర్నర్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేయడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. చదువుకునే యువతను రాజకీయ స్వార్థానికి రౌడీలుగా మార్చే కుట్రలను తల్లిదండ్రులు గమనించి తమ పిల్లలను అప్రమత్తం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

గతంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్ష పత్రాల మూల్యాంకనాన్ని ప్లంబర్లు, కార్మికులతో చేయించిన అక్రమాలపై గానీ, లిక్కర్ కుంభకోణంలో వేల కోట్ల రూపాయలు తాడేపల్లి ప్యాలెస్కు చేరాయంటూ వెలువడిన వాంగ్మూలాలపై గానీ జగన్ ఎందుకు నోరు మెదపరని అనిత నిలదీశారు. ఆ అవినీతి పాపాలు బయటపడటంతో ప్రజల దృష్టిని మళ్లించేందుకే డీఎస్సీపై తప్పుడు కూతలు కూస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టి అవమానించిన చరిత్ర జగన్దని, కూటమి ప్రభుత్వం బడిని గుడిగా, గురువులను దైవంగా భావిస్తూ గౌరవిస్తోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులపై దాడికి తెగబడిన రౌడీషీటర్లు, సంఘ విద్రోహ శక్తుల వికృత చేష్టలన్నీ సీసీటీవీ ఫుటేజీల్లో రికార్డయ్యాయని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని, రౌడీయిజంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర హెచ్చరికలు చేశారు.

## డోంట్ మిస్ ఎ బీట్‌తో గుండె ఆరోగ్యంపై ప్రజల్లో చైతన్యం

(మొదటి పేజీ తరువాయి)

సంబంధిత సమస్యలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గుండె ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ప్రపంచ హృదయ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.

ఈ ఏడాది డోంట్ మిస్ ఎ బీట్ అనే నినాదంతో గుండె ఆరోగ్యంపై ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. గుండె పనితీరుపై అవగాహన కలిగి ఉండటంతో పాటు, గుండెపోటుకు సంబంధించిన ముందస్తు హెచ్చరిక సంకేతాలను గుర్తించడం ఎంతో ముఖ్యమని సూచించారు. క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, వైద్యుల సూచనల మేరకు నిర్ణీత సమయాల్లో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత గుండె ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.ఆరోగ్యకరమైన ఆహారంలో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ప్రోటీన్లు సమపాళ్లలో తీసుకుంటూ, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండాలి. దీనితో పాటు రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ శారీరకంగా చురుకుగా ఉండటం ఆరోగ్యానికి చాలా ముఖ్యం. సమతుల్య ప్లేట్ లో కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు, ప్రోటీన్ ఆహారాలు, మరియు కొద్దిగా ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండేలా చూసుకోవాలి.రోజుకు 8-10 కప్పుల నీరు తాగుతూ, ప్రాసెస్ చేసిన ఆహారాలను తగ్గించి, తగినంత నిద్ర మరియు శారీరక శ్రమను అలవర్చుకోవాలి. కర్నూల్ హార్ట్ ఫౌండేషన్ 2002 సెప్టెంబర్ లో కర్నూలులో స్థాపించబడింది. అప్పటి కర్నూల్ జిల్లా కలెక్టర్ జి. సాయి ప్రసాద్ వ్యవస్థాపక అధ్యక్షులుగా, వ్యవస్థాపక కార్యదర్శిగా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ లను ఉన్నారు. గుండె జబ్బుల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 2003 నుంచి ప్రతి ఏడాది ప్రపంచ హృదయ దినోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నివారణాత్మక కార్డియాలజీ, ముందస్తు గుర్తింపు, ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రజలకు అవగాహన కల్పించడం ఫౌండేషన్ ప్రధాన లక్ష్యం.

ఈ నెల 29వ తేదీ మంగళవారం సాయంత్రం 6.00 గంటలకు కర్నూలు ఎ-క్యాంప్లోని కర్నూల్ హెల్త్ క్లబ్లో ప్రపంచ హృదయ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కర్నూల్ హార్ట్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

## 48 గంటల్లో రిజైన్ చేయాల్సిందే

**ఢిల్లీ, సెప్టెంబర్ 24:** ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అంశంపై కాక్రోచ్ జనతా పార్టీ తీవ్ర స్థాయిలో స్పందించింది. ప్రధాన ఎన్నికల కమిషనరు (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. లేదంటే జంతర్ మంతర్ వద్ద మరోసారి నిరసన కార్యక్రమాన్ని చేపడతామని(జంతర్ మంతర్ 2.0) హెచ్చరించింది. సర్‌పై జాతీయ మీడియాలో వచ్చిన కథనాలతో దుమారం చెలరేగిన నేపథ్యంలో ఢిల్లీలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సీజేపీ ప్రతినిధులు.. త్వరలో జరగబోయే అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలనూ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 'రెండు రోజుల్లోగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకుంటే దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతాం. అనంతరం ఢిల్లీలో జంతర్ మంతర్ 2.0 తప్పకుండా చేపట్టి తీరుతాం. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని భావిస్తే విపక్షాలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనవద్దు. ప్రజాస్వామ్యానికి సీఈసీ ఓ ముప్పులా తయారయ్యారు. ఓటు హక్కు రద్దు చేసేందుకు ఆయన ఎవరు?' అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రశ్నించారు.

**జ్ఞానేశ్‌పై క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలె..**

సీజేపీ కో-కన్వీనర్ సౌరవ్ దాస్ మాట్లాడుతూ.. మూడు డిమాండ్లను ఈసీ ముందు ఉంచుతున్నామని చెప్పారు. సీఈసీ రాజీనామా చేయడంతోపాటు ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. సర్ను నిలిపివేసి 2025 ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని, సర్ కు సంబంధించిన ఫైళ్లన్నింటినీ సుప్రీం కోర్టు నియమించిన కమిటీ ఆధీనంలో ఉంచాలని కోరారు.

## చంద్రబాబు కుట్రలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

ఆ అభ్యర్థుల ఎంపిక పూర్తి చేయాలని నిర్దేశించారు.

**అందరి అభిప్రాయంతో అభ్యర్థుల ఎంపిక:**

రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపాలి. వీలైనంత వేగంగా ఆ అభ్యర్థుల ఎంపిక పూర్తి కావాలి. అభ్యర్థుల ఎంపికలో మనం తీసుకునే నిర్ణయాలు రేపు వచ్చే ఎన్నికల్లో ఉపయోగపడాలి. పార్టీలో అందరితో మాట్లాడి అభిప్రాయాలు తీసుకోండి. పలు దఫాలుగా వారితో చర్చించి అభ్యర్థుల జాబితా రూపొందించండి. పార్టీని ఒక్కతాటిపైకి తీసుకు వచ్చి ఎన్నికల్లో ముందుకు నడపాలి. ఎప్పటికప్పుడు స్థానిక నాయకత్వాన్ని పర్యవేక్షిస్తూ బలోపేతం చేయాలి.

**అవన్నీ ప్రజల్లో గట్టిగా ఎండగట్టాలి:**

రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు అడ్డదారులతో పాటు, పోలీసుల బలంతో సీఎం చంద్రబాబు ఎన్నో కుట్రలు చేస్తారు. వాటన్నింటినీ ఎదుర్కోవడానికి మీరంతా సిద్ధంగా ఉండాలి. అందుకోసం ఎక్కడికక్కడ ప్రత్యామ్నాయాలు ఉంచుకోవాలి.

## బీసీ బిడ్డలను కంటికి రెప్పలా కాపాడాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉంటూ, విద్యార్థుల యోగా క్షేమాలను గమనిస్తూ ఉండాలన్నారు. వేడి, తాజా ఆహారం మాత్రమే అందించాలని స్పష్టంచేశారు. బయట ఆహారాన్ని లోపలికి రానివ్వొద్దని, కాచి చల్లార్చిన నీటి మాత్రమే అందివ్వాలని తెలిపారు. హాస్టళ్లు, గురుకులాల చుట్టు పక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, వ్యాధులు ప్రబలక ముందే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు అస్వస్థతకు గురి కాగానే సమీప ఆసుపత్రులకు తరలించాలన్నారు. పాత భవనాల్లో ఉన్న విద్యార్థులను సురక్షిత భవనాల్లోకి తరలించాలని మంత్రి సవిత ఆదేశించారు.

**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని బీసీ కార్పొరేషన్ చైర్మన్లకు మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. కూటమిలోని పార్టీలు, నాయకులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని స్పష్టంచేశారు. రెండేళ్ల సీఎం చంద్రబాబునాయుడు పాలనలో బీసీల అభివృద్ధి కోసం అమలు చేసిన పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని మంత్రి సవిత ఆదేశించారు.

## నిరసన వ్యక్తం చేస్తే రౌడీషీట్లు తెరుస్తామనడం చట్టవిరుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. డీఎస్సీ వ్యవహారంపై ప్రశ్నిస్తున్న వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తల గొంతు నొక్కేడమే కుకుండా తమపై రౌడీషీట్లు తెరుస్తామంటూ చంద్రబాబు, లోకేశ్ బెదిరింపులకు దిగడం సిగ్గుచేటని ఆక్షేపించారు. గుంటూరులోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డీఎస్సీ నియామకాల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో అర్హులైన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్ జగన్మోహన్రెడ్డి నాయకత్వంలోని ప్రతిపక్ష పార్టీగా జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించాల్సిన బాధ్యత తమపై ఉంది గుర్తు చేసారు. తమ పార్టీ చెబుతున్న అభ్యంతరాలను పరిశీలించి చర్యలు తీసుకునే ధైర్యం లేక, తిరిగి తమపైనే వేధింపులకు దిగుతోందని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఏదైనా అంశంపై తమకు జరిగిన అన్యాయాన్ని వివరించేందుకు నిరసన దిగితే వారిని రౌడీలంటారా? అని అంబటి రాంబాబు ప్రశ్నించారు.



## జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి

**ఢిల్లీ, సెప్టెంబర్ 24:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)విషయంపై ఎన్నికల సంఘంలో విభేదాలున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో లోక్సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 'ఓటు చోరీ' ద్వారా ఎంపీలుగా గెలిచిన వారు చేసిన చట్టాలు చెల్లబోవని చెప్పారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్గాంధీ మాట్లాడారు. మహారాష్ట్ర, హరియాణాలో ఓటు చోరీ జరిగిందని కాంగ్రెస్ లేవనెత్తిన తర్వాతే.. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు.. సీఈసీకు ఎస్ఐఆర్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారని అన్నారు. జ్ఞానేశ్ కుమార్ అప్రూవర్గా మారాలని.. అది దేశ ప్రయోజనాలకు మంచిదని వ్యాఖ్యానించారు. ప్రస్తుత సీఈసీని ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్షా ఎంపిక చేశారని రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుత గందరగోళానికి ఆయనే కారణమని ఇద్దరు కమిషనర్లు చెబుతున్న నేపథ్యంలో.. ఎంపిక చేసిన వాళ్లే బాధ్యత తీసుకోవాలని రాహుల్ డిమాండ్ చేశారు.

## సాహిల్ తల్లిదండ్రుల నిరాహార దీక్ష

### ఐఐటీ బాంబే పరీక్షలు వాయిదా

**ముంబై, సెప్టెంబర్ 24:** విద్యార్థి సాహిల్ వాకోడే ఆత్మహత్యపై నిరసనలు వ్యక్తమవుతున్న వేళ.. మిడ్ సెమిస్టర్ పరీక్షలను ఐఐటీ బాంబే వాయిదా వేసింది. ఈ నెల 26-27 తేదీల్లో జరగాల్సిన పరీక్షలను అక్టోబరు 10-11కు వాయిదా వేసింది. మరోవైపు.. తమ కుమారుడిని వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సాహిల్ తల్లిదండ్రులు ముంబయి లోని ఆజాద్ మైదాన్లో నిరాహార దీక్ష ప్రారంభించారు. "నా బిడ్డను వేధించిన వారిని జైలులో పెట్టాలి. విద్యాసంస్థలో తాను పదేపదే కులవివక్షను ఎదుర్కొన్నట్లు అతడు మాకు చెప్పాడు" అని సాహిల్ తండ్రి తెలిపారు. అంతకుముందు సాహిల్ తల్లిదండ్రులు 'జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్' ఛైర్మన్ను కలిసి.. తమ కుమారుడి మరణంపై దర్యాప్తు జరపాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. మరోవైపు.. విద్యార్థి కుటుంబానికి సంఘీభావంగా ఐఐటీ బాంబే వద్దకు వచ్చిన కాంగ్రెస్ ఎంపీ వర్షా గైక్వాడ్, ఆ పార్టీ కార్యకర్తలు, ఎన్ఎస్యూఐ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఇదిలా ఉండగా.. ప్రొఫెసర్ సూర్యనారాయణ 2024లో పంపినట్లు చెబుతున్న ఓ ఈమెయిల్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తోటి విద్యార్థుల అడ్మిషన్ కేటగిరీలు, జేఈఈ ర్యాంకులు, గేట్ స్కోర్ల గురించి అడగొద్దని విద్యార్థులకు సూచించినట్లు అందులో ఉంది. అటువంటి ప్రశ్నలతో వారి సామాజిక వర్గం, రిజర్వేషన్ వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. సాహిల్ను ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన్ను ఐఐటీ యాజమాన్యం ఇప్పటికే సెలవుపై పంపింది.





## విగ్రహ మండపాలకు భారీ చందాలు అందజేసిన ఉమ్మడి చిన్న

**యు కొత్తపల్లి, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** పొన్నాడ గ్రామపంచాయతీలో ఉన్న మల్లి వారి తోట, కానవపేట, పొన్నాడ గ్రామంలో ఉన్న సుమారు పది వినాయక విగ్రహ మండపాలకు చిన్న మండపాలకు 5000 చొప్పున, పెద్ద మండపాలకు 10000 రూపాయలు చొప్పున, మరి పెద్ద సైజు మండపాలకు 15 వేల రూపాయలు చొప్పున సుమారు లక్ష రూపాయలకు పైగా చందాలు అందజేసిన జనసేన సీనియర్ నాయకులు, పొన్నాడ సర్పంచ్ అభ్యర్థి ఉమ్మడి చిన్న. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్రామంలో ఉన్న ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి ముందడుగు వేస్తానని ఆయన అన్నారు. అంతేకాకుండా గ్రామంలో పెట్టిన వినాయక విగ్రహ మండపాలు గ్రామలో ఉన్న అందరూ ఆరోగ్యం మరియు ఆర్థికంగా బాగుండాలని ఉద్దేశంతోటే ఈ వినాయక విగ్రహాలు పెట్టారని అందుకు తన వంతు సహాయంగా ఈ చందాలు అందజేశానంటూ ఉమ్మడి చిన్న అన్నారు. ఆయన వెంట గ్రామస్తులు, ఆయన స్నేహితులు, అభిమానులు,కుటుంబీకులు పాల్గొన్నారు.

## జడ్పీటీసీ నీరుకొండ రామకుమారి సత్యనారాయణకు ఘన వీడ్కోలు



**ఏలేశ్వరం,సెప్టెంబర్,24:-(మనం న్యూస్) :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ పాలన ముగిసిన నేపథ్యంలో ఏలేశ్వరం మండలాన్ని ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయామని జడ్పీటీసీ నీరుకొండ రామకుమారి సత్యనారాయణ అన్నారు.జిల్లా పరిషత్కు నిధుల కొరత కారణంగా ప్రజలు ఆశించిన రీతిలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టలేకపోయామని తెలిపారు.జిల్లాబోర్డుగా ప్రారంభమై,అనంతరం జిల్లా పరిషత్గా,ప్రస్తుతం జిల్లా ప్రజాపరిషత్గా కొనసాగుతున్న ఈ సభలో ఎందరో ప్రముఖులు పనిచేశారని అన్నారు.అటువంటి సభలో జడ్పీటీసీగా పనిచేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.తాము బాధ్యతలు చేపట్టిన అనంతరం రెండేళ్లపాటు కొవిడ్ కారణంగా అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకాలు ఏర్పడ్డాయని,అనంతరం జిల్లా పరిషత్కు నిధుల కొరత ఏర్పడటంతో ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయామని పేర్కొన్నారు.రానున్న రోజుల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని,ఈ నేపథ్యంలో తామే ఉమ్మడి జిల్లా పరిషత్లో చివరి పాలకవర్గ సభ్యులుగా నిలిచే అవకాశం ఉందన్నారు.ఏలేశ్వరం మండల జడ్పీటీసీగా తనను ఎన్నుకున్న మండల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తన పదవీకాలంలో సహకరించిన ప్రజాప్రతినిధులు,అధికారులు,ప్రజలకు నీరుకొండ రామకుమారి సత్యనారాయణ ధన్యవాదాలు తెలిపారు.

## ముంపు ప్రాంతాల్లో బొదిరెడ్డి గోపి,మూది నారాయణ స్వామి పర్యటన



**ఏలేశ్వరం, సెప్టెంబర్, 24:-(మనం న్యూస్) :** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఏలేశ్వరం మున్సిపాలిటీ పరిధిలోని ముంపు ప్రాంతాలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదేశాల మేరకు క్లస్టర్ ఇన్చార్జి బొదిరెడ్డి గోపి,ఏలేశ్వరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు మూది నారాయణ స్వామి, కూటమి నాయకులతో కలిసి గురువారం పర్యటించారు.ముంపు ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలించి,ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అవసరమైన చోట తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.ముంపు ప్రాంతాల ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని,వర్షాలు తగ్గే వరకు పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటామని నాయకులు తెలిపారు.ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని,అత్యవసర పరిస్థితుల్లో అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు పలివెల వెంకటేష్,అధికారులు,మునిసిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు

## ఉప్పాడ తీరాన్ని పరిశీలించిన జేసీ అపూర్వ భరత్

**యు.కొత్తపల్లి, సెప్టెంబర్ 24 ( మనం న్యూస్):** ఉప్పాడ సముద్ర తీరాన్ని కాకినాడ జేసీ అపూర్వ భరత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా తీర ప్రాంతంలోని పరిస్థితులను పరిశీలించి, మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తుఫాను తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో తదుపరి సమాచారం అందించే వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని సూచించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మత్స్యకారులు అధికారులకు సహకరించాలని, ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని జేసీ కోరారు.అలాగే లోతట్టు ప్రాంతాలపై స్థానిక అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలకు ఎప్పటికప్పుడు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని జేసీ సూచించారు. ఈయన వెంట తాసిల్దార్ చిన్నారావు, పలు అధికారులు ఉన్నారు.



# తిమ్మమ్మ మర్రిమాను వద్ద ప్రపంచ పర్యాటక దినోత్సవం

- పార్టీలకు అతీతంగా ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలి
- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



**కదిరి,సెప్టెంబర్23మనంన్యూస్:-** గిన్నిస్ వరల్ రికార్డ్లో నమోదైన ప్రపంచ ప్రఖ్యాత తిమ్మమ్మ మర్రిమాను వద్ద ఈ నెల 27వ తేదీన ఉదయం 9 గంటలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాన్ని కదిరి నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు, పర్యాటకాభిమానులు పార్టీలకు అతీతంగా పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలం తిమ్మమ్మ మర్రిమాను వద్ద ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

గిన్నిస్ వరల్ రికార్డ్లో నమోదైన తిమ్మమ్మ మర్రిమాను కదిరి నియోజకవర్గానికే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రకృతి అద్భుతం యొక్క విశిష్టతను దేశ, విదేశాలకు మరింతగా పరిచయం చేసేలా ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

తిమ్మమ్మ మర్రిమాను అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని, గతంలో ఇచ్చిన మాట మేరకు తిమ్మమ్మ మర్రిమాను వద్ద బొటానికల్ గార్డెన్ నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తిమ్మమ్మ మర్రిమాను వద్ద పెద్దఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పర్యాటక ప్రాధాన్యత కలిగిన ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసి, తిమ్మమ్మ మర్రిమాను ప్రత్యేకతను ప్రపంచానికి మరింతగా పరిచయం చేయడంతో పాటు కదిరి నియోజకవర్గాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసే దిశగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ , జిల్లా ఎస్పీ సత్యకుమార్ ఐపిఎస్ , ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు ముఖ్య అతిథులు హాజరుకానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

తిమ్మమ్మ మర్రిమాను కదిరి నియోజకవర్గ ప్రజల గర్వకారణమని, ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఎమ్మెల్యే కోరారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కదిరి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు.

## అక్టోబర్ 1న పింఛన్ల పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- జిల్లాకు రూ.83.35 కోట్ల పింఛను నిధులు విడుదల
- జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్



**అమలాపురం, సెప్టెంబర్ 24, మనం ప్రతినిధి :** అక్టోబర్ 1వ తేదీన పింఛన్ల పంపిణీని సజావుగా, నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. సెప్టెంబర్ 2026 నెలకు సంబంధించిన పింఛన్ల పంపిణీ నిమిత్తం జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాలకు మొత్తం రూ.83.35 కోట్ల నిధులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 1వ తేదీ ఉదయం సంబంధిత బ్యాంకు శాఖల నుంచి అవసరమైన పింఛను నగదును ఉపసంహరించుకుని, మధ్యాహ్నం నుంచి లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేపట్టాలని అధికారులకు సూచించారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి జాప్యం జరగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

**బ్యాంకుల్లో నగదు అందుబాటులో ఉండేలా చర్యలు**

పింఛన్ల పంపిణీకి అవసరమైన నగదు అక్టోబర్ 1వ తేదీ ఉదయానికే సంబంధిత బ్యాంకు శాఖల్లో అందుబాటులో ఉండేలా అన్ని బ్యాంకు కంట్రోలర్లు, ఎల్డీఎంలకు ముందస్తు సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ, వార్డు సచివాలయ సంక్షేమ కార్యదర్శులు సంబంధిత బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకుని నగదు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

**పింఛనుదారులకు ముందస్తు సమాచారం అందించాలి**

ప్రతి పింఛనుదారునికి పంపిణీ తేదీ, సమయంపై ముందుగానే సమాచారం చేరేలా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పత్రికలు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా కూడా ప్రజలకు సమాచారం అందించాలని సూచించారు.

పింఛనుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పింఛన్ల పంపిణీ సజావుగా జరిగేలా అన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ స్పష్టం చేశారు.

## పూజలు చేస్తున్న సిద్ధాంతి పై క్రిమినల్ కేసు పెడతాను

- ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 24 మనం న్యూస్ :** నా మీద పూజలు చేస్తున్న సిద్ధాంతి పై క్రిమినల్ కేసు పెడతానని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం తాడేపల్లిగూడెం పురపాలక సంఘం కార్యాలయంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు నాతో పాటు ఉండొద్దని , నాతో వస్తే మీ అంతు చూస్తానని తెలుగుదేశం పార్టీ నాయకుడు భయపడుతున్నాడని అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలోకి నడిపిస్తుంటే తెలుగుదేశం పార్టీ ఒక నాయకుడు అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. శత్రువు కూడా చనిపోవాలని మనసులో కూడా అనుకోలేదని , అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. తాడేపల్లిగూడెం పురపాలక సంఘం రాబోయే ఎన్నికల్లో 35 వార్డులకు ఎన్నికలు జరుగుతాయి అన్నారు . ఆర్డిఓ సూర్యారావు , కమిషనర్ ఏసుబాబు , జనసేన పార్టీకి నాయకులు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

## వేలంక, వీరవరం ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పర్యటన

- వరద నీటిలోనే నడుస్తూ బాధితులకు పరామర్శ
- సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం

**కిర్లంపూడి సెప్టెంబర్ 24( మనం న్యూస్):** మండలంలోని వేలంక, వీరవరం గ్రామాల్లో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు ఆయన మోకాళ్ల లోతు వరద నీటిలోనే నడుచుకుంటూ వెళ్లి బాధితులను పరామర్శించారు. వారి సమస్యలు, ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, వరద బాధితులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఎవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు తాగునీరు, ఆహారం, వైద్య సదుపాయాలు అందేలా తక్షణమే సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలని సూచించారు. ఈ పర్యటనలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# మున్సిపల్ కార్మికులకు దసరా కానుక!



- నూతన దుస్తులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి
- మూడు నెలల పెండింగ్ వేతనాలు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కార్మికుల కృతజ్ఞతలు

**పుట్టపర్తి, సెప్టెంబర్ 24 మనం న్యూస్:** దసరా పండుగను పురస్కరించుకుని పుట్టపర్తి మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, మున్సిపల్ కార్మికులకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి దసరా కానుకగా నూతన దుస్తులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ.. పండుగ వేళ మున్సిపల్ కార్మికుల కుటుంబాల్లో సంతోషం నిండాలనే ఉద్దేశంతో దుస్తులు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం కార్మికులు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు మూడు నెలలుగా పెండింగ్లో ఉన్న వేతనాలను మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా కృషి చేశారు. పెండింగ్ వేతనాలు మంజూరు కావడంతో కార్మికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వేతనాలు మంజూరు చేయించడంతో పాటు దసరా పండుగ సందర్భంగా నూతన దుస్తులు అందజేయడం పట్ల కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపాలిటీకి చెందిన మున్సిపల్ కార్మికులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతాలు



**కాత్రేనికోన సెప్టెంబర్ 24 మనం ప్రతినిధి :** గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యకరంగా ఉండాలని ఎంపీడీవో బి రాజేశ్వరరావు తెలియజేశారు. గురువారం ముమ్మిడివరం ఐసిడిఎస్ సిడిపిఓ ఎం నిహారిక ఆధ్వర్యంలో తొమ్మిదవ జాతీయ పోషణ మాసం 2026 సందర్భంగా మన అంగనవాడి మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో రాజేశ్వరరావు తాసిల్దార్ రవి కిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన పౌష్టికాహారం తగిన జాగ్రత్తలను తెలియజేశారు. మహిళల ప్రాధాన్యతను తెలియజేస్తూ ఎంపీడీవో పాడిన పాట అందర్నీ ఆకట్టుకుంది . ఈ సందర్భంగా 40 రకాల అత్యంత ఉచితమైన పౌష్టికాహార వంటలను ప్రదర్శించడం జరిగింది. పౌష్టికాహా వస్తువులతో తీర్చిదిద్దిన ఐసిడిఎస్ లోగో అత్యంత ఆకర్షణ గా నిలిచింది. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చెల్లి సురేష్, మాజీ మండల అధ్యక్షులు నడింపల్లి సుబ్బరాజు, పిఎస్ఎన్ రాజు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు కే టి టి వి తులసి కుమారి, ఎల్ వి రమణి, దేవి, అంగన్వాడీ టీచర్ లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ ప్రభావంతో ఒమ్మంగి-శరభవరం రహదారి మూసివేత



**ప్రత్తిపాడు, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** ప్రత్తిపాడు మండలంలో తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఒమ్మంగి-శరభవరం రహదారిని తాత్కాలికంగా మూసివేశారు.రహదారిపై వర్షపు నీరు చేరి ప్రమాదకర పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా రాకపోకలను నిలిపివేసినట్లు ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం,తహశీల్దార్ ఎం సూర్యప్రభ,ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు.ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ రహదారి గుండా ప్రయాణించవద్దని అధికారులు సూచించారు.ఒమ్మంగి నుంచి శరభవరం వైపు వెళ్లే వారు ఉత్తరకంచి,పొదురుపాక మీదుగా వెళ్లాలని సూచించారు.అలాగే శరభవరం,పోతులూరు,చింతలూరు తదితర గ్రామాల ప్రజలు కొడవలి మీదుగా రాకపోకలు సాగించాలని అధికారులు సూచించారు.రహదారి పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు వాహనదారులు ఈ మార్గంలో రాకపోకలు సాగించవద్దని,ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ అవసరాల గోపాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## బేటీ బచావో... బేటీ పఢావో

నీ చెల్లెకంటే చిన్నది కదరా
ఆ ముఖంలో, నీ అమ్మ కనిపించలేదురా
చేతులు జోడించి వేడుకొన్నది
జింకపిల్లలా వొణికి పోయింది
వెంటున్న పిల్లాడినుంచి,
క్రూరంగా లాక్కెళ్లావు కదరా

నిస్సహాయంగా పిల్ల తల్లడిల్లింది
తోడున్న పిల్లాడు, భయాన్ని జయించాడు
తెగించి నమ్మకాన్ని, లోకాన రక్షించాడు

అమ్మాయిని నలిపేశావు
సగం ప్రాణం తీసేశావు
అసభ్యంగా, మృగంలా వేటాడావు
మానవత్వాన్ని చెరిచావు కదరా

కాపలా ఏమైంది, కర్తవ్యమేమైంది
చీకట్లో దీపమేమైంది
చుట్టూవున్న మనుషులకేమైంది

ఆ చిన్న అభిమన్యుడే లేకపోతే
అమ్మాయి జీవితం గుడ్డిదయ్యేది కదరా

బేటీ బచావో ఏమైంది
బేటీ పఢావో ఏమైంది

ప్రజల స్వప్నం ఏమైంది
ఈ దేశానికి ఏమైంది
(బీహార్ - 19 సెప్టెంబర్ 2026న, జముయ్‌లో - మైనర్ అమ్మాయి మీద, అబ్బాయి మీద దాడిచేసి, హింసించిన సంఘటన)

**- ఆశారాజు**
9392302245

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు**

**ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్**


# ఫిరాయింపులపై అనర్హతే 'సుప్రీం' తీర్పు

ప్రజాస్వామ్య మహాసౌధానికి పటిష్ఠమైన పునాది ప్రజాతీర్పు. నిశ్శబ్ద విప్లవంగా సాగే ఓటు హక్కు కేవలం ఒక అభ్యర్థి రూపురేఖలకో, వ్యక్తిగత ప్రాబల్యానికో ఇచ్చే సమ్మతి పత్రం కాదు. ఆ అభ్యర్థి ప్రాతినిధ్యం వహించే రాజకీయ సిద్ధాంతానికి, పార్టీ ప్రణాళికకు, ప్రజాస్వామిక వాగ్దానానికి పౌరులు అందించే పవిత్రమైన తీర్పు. అయితే ఎన్నికల బరిలో ఒక జెండా నీడన గెలిచి, అధికార పీఠం ఎక్కిన పిదప వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసమో, రాజకీయ అవకాశవాదం కోసమో పార్టీ కండువాలు మార్చేసే 'ఆయా రామ్-గయా రామ్' సంస్కృతి భారత రాజకీయాలను దశాబ్దాల పాటు భ్రష్టు పట్టించింది. ఈ నైతిక పతనానికి ముకుతాడు వేసేందుకు, రాజ్యాంగ నైతికతను పరిరక్షించేందుకు 1985లో రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న తరుణంలో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా తీసుకొచ్చిన రక్షణ కవచమే పదో షెడ్యూల్. భారత రాజ్యాంగంలోని 102(2), 191(2) అధికరణలకు వెన్నుదన్నుగా నిలిచిన ఈ 'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం' కేవలం కాగితపు నిబంధనల సంపుటి కాదు. అది ఓటు వేసిన ప్రజల ఆత్మగౌరవానికి చట్టం కల్పించిన వజ్రాయుధం.

ఈ రాజ్యాంగ నిబంధనావళిని నిశితంగా పరిశీలిస్తే, పదో షెడ్యూల్లోని రెండో పేరా ప్రజాప్రతినిధుల అనర్హతకు సంబంధించి తిరుగులేని గీటురాళ్లను నిర్దేశిస్తుంది. ఇందులో ప్రధానంగా చర్చనీయాంశమయ్యేది పేరా 2(1)(ఎ). ఏ రాజకీయ పార్టీ తరపునైతే ఒక సభ్యుడు శాసనసభకు లేదా పార్లమెంటుకు ఎన్నికవుతాడో, ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని అతడు స్వచ్ఛందంగా వదులుకుంటే అతడు సభాసభ్యత్వానికి తక్షణమే అనర్హుడవుతాడని ఈ నిబంధన కుండబద్దలు కొడుతుంది. ఇక్కడ చట్టం చెప్పే 'స్వచ్ఛందంగా వదులుకోవడం' అనే మాటకు న్యాయస్థానాలు విస్తృతమైన, విప్లవాత్మకమైన భాష్యం చెప్పాయి. 1994 నాటి సుప్రసిద్ధ 'రవి నాయక్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసు మొదలుకొని ఎన్నో కీలక తీర్పుల్లో అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసిన సూత్రం ఏమిటంటే...సభ్యత్వాన్ని వదులుకోవడమంటే కేవలం రాతపూర్వకంగా పార్టీకి రాజీనామా లేఖ సమర్పించడం మాత్రమే కాదు. సదరు ప్రజాప్రతినిధి బహిరంగ ప్రవర్తన, ప్రత్యర్థి పార్టీల వేదికలను పంచుకోవడం, ప్రత్యర్థి సిద్ధాంతాలను ప్రచారం చేయడం, ఇతర పార్టీల కండువాలు కప్పుకోవడం వంటి పనులన్నీ కూడా అతడు తన మాతృపార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా పరిత్యజించినట్లేనని చట్టం పరిగణిస్తుంది. అంటే చట్టం కన్నుగప్పి రాజీనామా చేయకుండానే అవతలి గట్టున చేరి అధికార సౌఖ్యాలు అనుభవించాలనుకునే రాజకీయ చతురతకు ఈ నిబంధన గొడ్డలిపెట్టుగా నిలుస్తుంది.

దీనికి భిన్నంగా పేరా 2(1)(బి) సభా అంతర్గత క్రమశిక్షణను నిర్దేశిస్తుంది. సభలో ఏదైనా బిల్లుపై లేదా తీర్మానంపై ఓటింగ్ జరిగే సమయంలో పార్టీ జారీ చేసిన విప్ (ఆదేశం)ను ధిక్కరించి ఓటు వేసినా, లేదా అనుమతి లేకుండా ఓటింగ్‌కు గైర్హాజరైనా ఆ సభ్యుడిపై అనర్హత వేటు పడుతుంది. అయితే ఈ నిర్దిష్ట నిబంధన కింద ఒక మినహాయింపు లేదా ఉపశమనం ఉంది. సభ్యుడి ఉల్లంఘనను సంబంధిత రాజకీయ పార్టీ పదిహేను రోజుల వ్యవధిలో అధికారికంగా క్షమిస్తే ఆ అనర్హత రద్దవుతుంది. పదో షెడ్యూల్లోని ఈ రెండు నిబంధనల నడుమ ఉన్న మౌలికమైన, సూక్ష్మమైన భేదమేమిటంటే...సభలో విప్ ఉల్లంఘనను మాత్రమే పార్టీ క్షమించగలదు కానీ, పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వీడి ప్రత్యర్థి శిబిరంలోకి ప్రవేశించిన తీవ్రమైన ఉల్లంఘనను (పేరా 2(1)(ఎ)) తర్వాత కాలంలో పార్టీ క్షమించినంత మాత్రాన రాజ్యాంగబద్ధమైన అనర్హత తొలగిపోదని న్యాయశాస్త్రం స్పష్టం చేస్తోంది.

ఇక పదో షెడ్యూల్లోని పేరా 4 మరియు పేరా 5 కూడా అత్యంత లోతైన విశ్లేషణను కోరుతాయి. తొలినాళ్లలో పేరా 3 కింద ఒక పార్టీ శాసనసభా పక్షంలో మూడింట ఒకవంతు మంది సభ్యులు చీలిపోతే దానికి రక్షణ ఉండేది. అయితే ఈ లొసుగును అడ్డం పెట్టుకుని ప్రజాప్రతినిధులను సామూహికంగా కొనుగోలు చేసే వ్యాపార రాజకీయం పెరిగిపోవడంతో, 2003లో వాజ్‌పేయి ప్రభుత్వం తెచ్చిన 91వ రాజ్యాంగ సవరణ ద్వారా చీలిక నిబంధనను పూర్తిగా రద్దు చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నాలుగో పేరా ప్రకారం...ఒక రాజకీయ పార్టీ మరొక పార్టీలో విలీనమైనపుడు, ఆ శాసనసభా పక్షంలోని కనీసం మూడింట రెండొంతుల మంది సభ్యులు ఆ నిర్ణయానికి ఆమోదం తెలిపితేనే అది చట్టబద్ధమైన విలీనమవుతుంది. అప్పుడే పదో షెడ్యూల్ నుంచి వారికి రక్షణ లభిస్తుంది. అదేవిధంగా ఐదో పేరా సభాపతి, ఉపసభాపతి, మండలి చైర్మన్ వంటి రాజ్యాంగబద్ధమైన ఉన్నత స్థానాల్లో కూర్చునే వ్యక్తులకు వారి నిష్పాక్షికతను కాపాడేందుకు రాజకీయ అనుబంధంపై కొన్ని మినహాయింపులను ప్రసాదిస్తుంది.




ఈ సమగ్ర రాజ్యాంగ పరిధిలోనే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారం దేశ రాజకీయ, న్యాయ యవనికపై తీవ్రమైన ప్రకంపనలు సృష్టించింది. 2023 తెలంగాణ శాసనసభ సార్వత్రిక ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) గులాబీ జెండా నీడన, కారు గుర్తుపై పోటీ చేసి దానం నాగేందర్ ఖైరతాబాద్ ప్రజల మన్ననలు పొంది ఎమ్మెల్యేగా గెలుపొందారు. కానీ కాలం గడవక ముందే, శాసనసభ సభ్యుడిగా ఇంకా ప్రమాణ స్వీకారం చేసి కొన్ని నెలలు కూడా నిండకముందే రాజకీయసమీకరణాలు మారాయి. ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా సికింద్రాబాద్ పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేసి పోటీకి దిగారు. ఒక పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా కొనసాగుతూనే, మరో పార్టీ తరపున ఎంపీగా పోటీకి దిగడం భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే అత్యంత విడ్డూరమైన, నిర్లజ్జ రాజకీయాంశంగా మారింది. ఇది ముమ్మాటికీ రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ పేరా 2(1)(ఎ) కింద స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకోవడమేనంటూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ 2026 మార్చి 11న నిర్ణయం తీసుకుంటూ వాటిని తిరస్కరించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది.

స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన న్యాయపోరాటంలో తెలంగాణ హైకోర్టు రాజ్యాంగ ఔన్నత్యాన్ని సమున్నతంగా నిలబెట్టింది. న్యాయస్థానం సెప్టెంబర్ 18న సంచలన తీర్పు వెలువరిస్తూ, స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం నాగేందర్‌ను శాసనసభ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించింది. అంతేకాకుండా, ఆయన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన చట్టబద్ధమైన తేదీ అయిన 2024 ఏప్రిల్ 23 నుంచే ఈ అనర్హత వర్తిస్తుందని, నాటి నుంచే ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించాలని అత్యంత స్పష్టమైన తీర్పునిచ్చింది. హైకోర్టు ఇచ్చిన ఈ చారిత్రక తీర్పును సవాలు చేస్తూ దానం నాగేందర్ దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే సెప్టెంబర్ 24, 2026న భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఆయన పిటిషన్‌ను నిర్ద్వంద్వంగా కొట్టివేసింది. హైకోర్టు రాజ్యాంగ స్ఫూర్తిని, పదో షెడ్యూల్ మూల ఉద్దేశాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకుని సరైన తీర్పునిచ్చిందని, అందులో తాము జోక్యం చేసుకోవలసిన అవసరమే లేదని తేల్చిచెప్పింది.

ఈ విచారణ సందర్భంగా దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు పదో షెడ్యూల్లో సభ్యుడి చర్యను పార్టీ క్షమించే వెసులుబాటు ఉందని చేసిన వాదనను అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా తోసిపుచ్చింది. పేరా 2(1)(బి)లో చెప్పబడిన పదిహేను రోజుల క్షమాభిక్ష కేవలం సభలో ఓటింగ్ ధిక్కరణకు మాత్రమే పరిమితమని, పేరా 2(1)(ఎ) కింద వేరే పార్టీ కండువా కప్పుకుని, ఆ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసిన బహిరంగ ఫిరాయింపునకు ఎలాంటి క్షమాభిక్ష వర్తించబోదని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం గట్టిగా స్పష్టం చేసింది. ఈ తీర్పు భారత ప్రజాస్వామిక వ్యవస్థలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. ఒకప్పుడు పదో షెడ్యూల్‌ను రాజకీయ నాయకులు తమ అనుకూలతకు వాడుకునే మైనపు ముద్దగా మార్చి, స్పీకర్ల కాలయాపన వ్యూహాలతో పదవీకాలాన్ని లాగించేసే పద్ధతులకు ఈ తీర్పు కళ్లెం వేసింది. రాజ్యాంగ నైతికత అనేది రాజకీయ విన్యాసాల కంటే ఉన్నతమైనదని, ప్రజల తీర్పును అపహాస్యం చేసే ఏ ప్రజాప్రతినిధి అయినా రాజ్యాంగం విసిరే అనర్హత ఖడ్గానికి బలికాక తప్పదని సుప్రీంకోర్టు తీర్పు పునరుద్ఘాటించింది. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు, వారి ఆశయాలే శాసనాలు.. అధికారం కోసం సిద్ధాంతాలను కాలరాసి పార్టీలు మారే రాజకీయ నాయకులకు పదో షెడ్యూల్ ఒక హెచ్చరికగా నిలుస్తుందనడానికి దానం నాగేందర్ అనర్హత వ్యవహారమే నిదర్శనం.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# వికసిత్‌భారత్‌కు ఉపాధ్యాయుడే మార్గదర్శి



యువ నాయకత్వానికి ఆలోచన, ఆచరణ, ఆదర్శాన్ని అందించాల్సిన బాధ్యత గురువులదే. భారతదేశం 2047 నాటికి వికసిత్ భారత్‌గా అవతరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నవేళ, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తిగా యువతపై దృష్టి కేంద్రీకృతమవుతోంది. యువతలోని ఆలోచనాశక్తి, సృజనాత్మకత, నైపుణ్యం, నాయకత్వ సామర్థ్యాలను దేశ నిర్మాణానికి అనుసంధానించడంలో వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ వంటి వేదికలు కీలకమైనవి. అయితే యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో అత్యంత ముఖ్యమైన పాత్ర పోషించేది ఉపాధ్యాయులే.



ఉపాధ్యాయుడి బాధ్యత తరగతి గదిలో పాఠ్యాంశాలను బోధించడంతో ముగియదు. విద్యార్థి ఆలోచించే విధానాన్ని మార్చడం, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించడం, సమాజాన్ని అర్థం చేసుకునే దృష్టిని కల్పించడం, బాధ్యతాయుత పౌరుడిగా తీర్చిదిద్దడం కూడా గురువు బాధ్యతే. ఒక విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, దానికి సరైన దిశ చూపగలిగితే అదే ప్రతిభ భవిష్యత్తులో దేశానికి నాయకత్వాన్ని అందించగలదు.

వికసిత్ భారత్ నిర్మాణంలో యువత తమ ఆలోచనలు, సూచనలు, సృజనాత్మక పరిష్కారాలను ముందుకు తీసుకురావాలి. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఉపాధి, సాంకేతికత, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి వంటి అంశాలపై విద్యార్థులు ఆలోచించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. చర్చలు, డిబేట్లు, ప్రాజెక్టులు, సమస్య పరిష్కార కార్యక్రమాలు, గ్రూప్ యాక్టివిటీస్ ద్వారా విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, మాట్లాడే నైపుణ్యం మరియు నాయకత్వ నైపుణ్యం అభివృద్ధి చేయవచ్చు. నాయకత్వం అంటే కేవలం ఒక పదవిని పొందడం కాదు. సమస్యను గుర్తించడం, బాధ్యత తీసుకోవడం, పరిష్కారం కోసం ప్రయత్నించడం, ఇతరులను కలుపుకొని ముందుకు సాగడం నిజమైన నాయకత్వ లక్షణాలు. ఈ విలువలను విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అపారమైనది. తరగతి గదిలో విద్యార్థులకు బాధ్యతలు అప్పగించడం, బృందాలను నడిపించే అవకాశాలు ఇవ్వడం, నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహించడం ద్వారా నాయకత్వ లక్షణాలకు పునాది వేయవచ్చు.

నేటి యువత సాంకేతిక పరిజ్ఞానంలో ముందంజలో ఉంది. కృత్రిమ మేధస్సు, డిజిటల్ టెక్నాలజీ, రోబోటిక్స్, బయోటెక్నాలజీ వంటి రంగాలు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయి. అయితే సాంకేతిక నైపుణ్యాలతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత, రాజ్యాంగ స్ఫూర్తి, పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కూడా అవసరం. వికసిత్ భారత్ లక్ష్యం నగరాల అభివృద్ధితో మాత్రమే సాధ్యం కాదు.

గ్రామీణ ప్రాంతాల యువతకు కూడా సమాన అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరి జ్ఞానం మరియు ఉపాధి అవకాశాలు అందాలి. ముఖ్యంగా ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు గ్రామీణ విద్యార్థులలోని ప్రతిభను వెలికితీసి, వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాల్సిన అవసరం ఉంది. ఒక మంచి ఉపాధ్యాయుడు విద్యార్థికి సరైన ప్రశ్నలు అడగడం నేర్పిస్తాడు. ఒక మంచి గురువు విద్యార్థిని పరీక్షలకు మాత్రమే కాకుండా జీవితానికి సిద్ధం చేస్తాడు. అందుకే వికసిత్ భారత్‌లో ఉపాధ్యాయుల పాత్ర మార్గదర్శకుడు, ప్రేరణదాత, శిక్షకుడు, ఆలోచనలకు దిశానిర్దేశకుడు అనే కోణాల్లో ఎంతో ప్రాధాన్యమైనది.

వికసిత్ భారత్ అనేది కేవలం ప్రభుత్వ లక్ష్యం కాదు. అది ప్రతి పౌరుడి సమిష్టి బాధ్యత. ఆ బాధ్యతను యువతలో నాటే మొదటి వేదిక విద్యా సంస్థ.

ఆ వేదికకు దిశానిర్దేశం చేసే శక్తి ఉపాధ్యాయుడు. యువత దేశ భవిష్యత్తు అయితే, ఆ భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులు ఉపాధ్యాయులు. కాబట్టి ప్రతి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి, ఆలోచనకు రెక్కలు ఇచ్చి, నాయకత్వానికి దిశ చూపి, దేశ సేవకు సిద్ధం చేయాలి. అప్పుడు మాత్రమే వికసిత్ భారత్ 2047 అనే లక్ష్యం సాకారమవుతుంది. యువత కృషే వికసిత్ భారత్‌కు బలమైన పునాది.

**- ఎస్. పద్మావతి**

# యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

యువత దేశానికి వెన్నెముక లాంటిది. వారి చేతుల్లోనే భవిష్యత్తు నిర్మాణం సాగుతుంది. అటువంటి యువతలో సేవా భావాన్ని పెంపొందించడం ఎలా? సేవ అంటే తన స్వార్థాన్ని పక్కన పెట్టి, ఇతరుల కోసం ఆలోచించడం. తన శక్తి సామర్థ్యాలను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించడం. ప్రాచీన కాలం నుంచి భారతీయ సంస్కృతిలో సేవకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. 'పరోపకారార్థం ఇదం శరీరం' అని లోకోక్తి. అంటే ఇతరుల మేలు కోసమే ఈ శరీరం అని అర్థం. ఈ భావన నేటి యువతలో కూడా ఉండాలి. కానీ ఆధునిక జీవనశైలి,వ్యక్తిగత లక్ష్యాలపై దృష్టి వంటి అంశాలు యువతను స్వార్థం వైపు నెడుతున్నాయి.



యువత సమాజ సేవలో పాల్గొనడం అనేది వారి వ్యక్తిగత అభివృద్ధికి సహాయపడుతుంది. సహాయం చేయడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నాయకత్వ గుణాలు అలవడతాయి. సమస్యలను పరిష్కరించే సామర్థ్యం వస్తుంది. సామాజిక కోణంలో చూస్తే, యువత సేవ వల్ల సమాజంలోని అనేక సమస్యలు పరిష్కారం

నేషనల్ సర్వీస్ స్కీమ్ (NSS) అనేది భారత ప్రభుత్వం చేపట్టిన అత్యంత విజయవంతమైన కార్యక్రమాలలో ఒకటి. 1969లో ప్రారంభమైన ఈ కార్యక్రమం లక్షలాది మంది విద్యార్థులను సేవా మార్గంలో నడిపించింది. కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులు ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొంటారు. గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలను అర్థం చేసుకుంటారు. పారిశుధ్య కార్యక్రమాలు, అక్షరాస్యతా ఉద్యమాలు, ఆరోగ్య శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక కార్యకలాపాల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమం వల్ల యువతకు గ్రామీణ జీవనం గురించి అవగాహన కలుగుతుంది.

ప్రపంచంలోని ఇతర దేశాల్లో కూడా యువత సేవా కార్యక్రమాలు విస్తృతంగా ఉన్నాయి. అమెరికాలో 'పీస్ కార్ప్స్' అనే సంస్థ యువతను అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పని చేయడానికి పంపుతుంది. ఆఫ్రికా, ఆసియా దేశాల్లో విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి రంగాల్లో యువ స్వచ్ఛంద సేవకులు పని చేస్తారు. జపాన్‌లో 'యువ స్వచ్ఛంద సేవ' అనే కార్యక్రమం ద్వారా విద్యార్థులు ముసలి వారికి, వికలాంగులకు సహాయం చేస్తారు. జర్మనీలో 'ఫెడరల్ వాలంటరీ సర్వీస్' అనే కార్యక్రమం యువతకు సామాజిక సేవలో పాల్గొనే అవకాశం ఇస్తుంది. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న యువత తర్వాతి కాలంలో మంచి పౌరులుగా, బాధ్యతాయుతమైన నాయకులుగా ఎదుగుతారు. భారతదేశం కూడా ఈ దిశలో మరింత ముందుకు సాగాలి.ఎన్ఎస్ఎస్ లాంటి కార్యక్రమాలను మరింత విస్తరించాలి.

పిల్లలకు చిన్న వయసు నుంచే సేవా భావాన్ని నేర్పాలి. ఇంటి పెద్దలు సేవ చేస్తూ ఉంటే, పిల్లలు కూడా నేర్చుకుంటారు. విద్యాసంస్థల్లో సేవను పాఠ్యప్రణాళికలో భాగం చేయాలి. పరీక్షల్లో సేవా కార్యకలాపాలకు మార్కులు ఇవ్వాలి. యువతకు ప్రోత్సాహకాలు,ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి.

భారతదేశంలో అనేక మంది యువకులు సేవలో రాణించి, ఇతరులకు స్ఫూర్తినిస్తున్నారు. అరుణాచలం మురుగనాథం లాంటి సామాజిక కార్యకర్తలు యువతను ప్రోత్సహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న యువకులు తమ ఊర్లలోనే ఉండి, అభివృద్ధి పనులు చేపడుతున్నారు. నగరాల్లో ఉన్న యువత గ్రామాలకు వెళ్లి, సేవ చేస్తున్నారు. ఐటీ ఉద్యోగులు తమ సెలవు దినాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, అక్షరాస్యతా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు గ్రామాలలో మంచినీటి సమస్యలు, విద్యుత్ సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నారు. యువతలో సేవా భావాన్ని పెంపొందించడం అనేది ఒక రోజు పని కాదు. అది నిరంతర ప్రక్రియ. కుటుంబం, విద్యాసంస్థలు, ప్రభుత్వం, సమాజం అందరూ కలిసి కృషి చేస్తేనే సాధ్యమవుతుంది. యువత తాము చదువుకున్న జ్ఞానాన్ని, సంపాదించిన సామర్థ్యాలను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలి. సమాజంలో గౌరవం దక్కుతుంది. దేశం అభివృద్ధి చెందుతుంది.

**- చిటికెన కిరణ్ కుమార్**
9490841284

# రోగికీ వైద్యుడికీ వారధి ఫార్మసిస్టే...



మానవ మనుగడలో ప్రాణ రక్షణ కంటే ప్రాధాన్యమైనది మరొకటి లేదు. ఈ భూమ్మీద జన్మించిన ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ఆశిస్తారు. ఆ దిశగానే ఆధునిక మానవుడు వైద్య విజ్ఞానం పైన, వైద్యులు అందించే మందులపైన విశేషంగా ఆధారపడుతున్నాడు. నిత్య జీవితంలో ఏ చిన్న శారీరక రుగ్మత ఎదురైనా వెంటనే ఏదో ఒక ఔషధాన్ని ఉపయోగించడం పరిపాటిగా మారింది. దీనిబట్టి మానవ జీవితంలో మందుల ప్రమేయం ఎంతటి కీలక స్థానాన్ని ఆక్రమించిందో గ్రహించవచ్చు. అయితే, రోగాన్ని గుర్తించడం ఒక ఎత్తయితే, దానికి తగిన సమర్థవంతమైన ఔషధాలను సృష్టించడం, వాటి నాణ్యతను కాపాడడం, సురక్షితమైన రీతిలో ప్రతి రోగికి అందేలా చూడడం మరొక ఎత్తు. నిజానికి ఔషధం లేని చికిత్సను ఊహించలేము. అందుకే, సమాజంలో వ్యాధుల నివారణకు నిజమైన శోధకులుగా, రోగ నివారణకు వెన్నుముకగా నిలిచే అసలు కర్మచారులు ఫార్మసిస్టులే అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

అపారమైన ప్రజా సంక్షేమ ధ్యేయంతో శ్రమిస్తున్న ఈ నిపుణుల సేవలను ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ గుర్తించాలనే లక్ష్యంతో అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ (FIP) నిరంతరం కృషి చేస్తోంది.

ఫార్మారంగ ప్రతిష్టను, ఫార్మసిస్టుల బాధ్యతాయుతమైన పాత్రను ప్రతిబింబిస్తూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25వ తేదీన ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యాన్ని పురస్కరించు కుని, 2026 నాటి ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం కోసం 'ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ఫార్మసిస్టులను సాధికారత వైపు నడిపించడం' (Empowering Pharmacists for Healthier Futures) అనే ప్రతిష్టాత్మక ఇతివృత్తాన్ని అంత ర్జాతీయ సమాజం ఎంచుకుంది. ఈ నేపథ్యం ప్రపంచ ఆరోగ్య రక్షణలో ఫార్మసిస్ట్ స్థానాన్ని మరింత ఎత్తుకు తీసుకె ళ్తోంది.

వైద్య రంగాన్ని పరిశీలిస్తే రోగాన్ని నిరోధించే క్రమం లో ప్రాథమిక బాధ్యత వైద్యుడిదైతే, ఆ రోగాన్ని అణచివేసే సరైన ఔషధాన్ని అందించే బాధ్యత ఫార్మసిస్టుది.

ఔషధం ఏ మోతాదులో తీసుకోవాలి, రోజులో ఎన్ని సార్లు వాడాలి, ఏ ఆహారంతో కలిపి తీసుకోకూడదు, దానివల్ల సంభవించే దుష్ప్రభావాలు (Side Effects) ఏముంటాయి అనే విజ్ఞానాన్ని అందించడంలో ఫార్మసిస్టు పాత్ర అపారమైనది. రోగికి, వైద్యునికి మధ్య వీరు ఒక ప్రత్యక్ష వంతెనగా పనిచేస్తారు. క్లినికల్ ట్రయల్స్ నుంచి మందుల నిల్వ వరకు, పరిశోధనా రహిత విజ్ఞానం నుంచి సమాజంలోని ప్రతి వ్యక్తికి ఆ మందు చేరే వరకు ప్రతి దశలోనూ ఫార్మసిస్ట్ చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఫార్మసిస్ట్ పర్యవేక్షణ లేకుండా అందించే ఏ వైద్యమైనా సంపూర్ణమైన ఫలితాన్ని ఇవ్వడం అసాధ్యం.

అత్యవసర పరిస్థితుల్లో, సుదూర ప్రాంతాల్లో వైద్యులు అందుబాటులో లేని తరుణంలో, ప్రాథమిక వైద్య సలహాలు అందిస్తూ రోగులను కాపాడడంలో ఫార్మసిస్టులు ముందంజలో ఉంటారు. ఈ అవసరాన్ని భారత ప్రభుత్వం స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలోనే గుర్తించింది. అందుకే 1948లోనే భారత ఫార్మసీ చట్టాన్ని రూపకల్పన చేసి ఆమోదించారు. అయితే, సరైన అమలుకు నోచుకోకపోవడం వల్ల దశాబ్దాలుగా మన దేశంలో ఫార్మసిస్టుల ప్రాధాన్యతకు తగినంత అధికారిక గుర్తింపు దక్కలేదు.

అనేక దేశాల్లో వైద్యులు రాసిన ప్రిస్క్రిప్షన్లను సమీక్షించి మార్పులు సూచించే అధికారం కూడా ఫార్మసిస్టులకు ఉంటుంది. కానీ మనవద్ద ఫార్మసిస్టు - వైద్యుల మధ్య ఉండాల్సిన సమన్వయ వ్యవస్థ ఇంకా పూర్తి స్థాయిలో బలోపేతం కాలేదు. దీనిఫలితంగా అవసరానికి మించి మందుల వినియోగం పెరిగిపోవడం, తద్వారా తీవ్ర మైన దుష్ప్రభావాలు ఎదురుకావడం జరుగుతోంది.

ప్రస్తుత ప్రపంచాన్ని తీవ్రంగా భయపెడుతున్న సంక్షోభాల్లో 'యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్' (AMR) అత్యంత ప్రమాదకరమైనది. చిన్న చిన్న అనారోగ్యాలకు కూడా డాక్టర్ సలహా లేకుండా క్రమరహితంగా యాంటిబయోటిక్స్ వాడటం వల్ల, వ్యాధి క్రిములు ఆ మందులను తట్టుకునే శక్తిని పెంచుకుంటున్నాయి. ప్రతి సంవత్సరం పెరుగుతున్న ఈ తీవ్ర ముప్పును అరికట్టడంలో ఫార్మసిస్టులు ప్రజా రక్షణ కవచంలా పనిచేస్తున్నారు. వైద్యుడి ఆమోదం లేనిదే యాంటిబయోటిక్స్ అందించకూడదనే నిబంధనలను పాటించడంతో పాటు, రోగులు మందుల కోర్సును మధ్యలోనే ఆపకుండా వాడేలా అవగాహన కల్పించడంలో ఫార్మసిస్టులు క్రియాశీలక భూమిక పోషిస్తున్నారు.

దీనికితోడు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ హెల్త్ యుగంలో భవిష్యత్ ఫార్మా రంగం సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా మారుతోంది. జన్యుఆధారిత చికిత్సలు (Personalized Medicine), ఈ-ప్రిస్క్రిప్షన్లు, రోబోటిక్ డ్రగ్ డిస్పెన్సింగ్ వంటి సాంకేతిక మార్పులను స్వీకరిస్తూ, డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా దూరప్రాంత రోగులకు టెలి-ఫార్మసీ సేవలు అందించడంలో ఫార్మసిస్టులు కీలక భాగస్వాములుగా మారనున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సమగ్ర ఆరోగ్య సేవలు అందాలంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న ఫార్మసిస్ట్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలి. అలాగే, నేడు గ్రామీణ ఉపకేంద్రాల్లో కూడా మందుల పంపిణీ పరిధి విస్తరిస్తున్నందున, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా అక్కడ కూడా నూతనంగా ఫార్మసిస్ట్ పోస్టులను మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన నిరుద్యోగ ఫార్మా గ్రాడ్యుయేట్లకు సొంతంగా ఫార్మసీ కేంద్రాలను స్థాపించుకోవడానికి వడ్డీ రహిత రుణాలు, ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించడం వల్ల గ్రామీణ ప్రాంతాలకు ఆరోగ్య సేవలు విస్తరించడమే కాకుండా, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి.

కమ్యూనిటీ హెల్త్ నెట్‌వర్క్‌లలో ఫార్మసిస్టులకు తగిన స్థానం కల్పించడం ద్వారానే నూతన ఔషధ పరిశోధనల్లో, నాణ్యతా నియంత్రణలో భారతదేశం గ్లోబల్ లీడర్‌గా ఎదగగలదు. 2026 నాటి 'ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ఫార్మసిస్టులను సాధికారత వైపు నడిపించడం' అనే ప్రధాన నినాదం నెరవేరాలంటే ఫార్మసిస్టులకు తగిన గౌరవం, చట్టబద్ధమైన సాధికారత, వృత్తిపరమైన స్వేచ్ఛ కల్పించడం అత్యావశ్యకం.

ఏ సమాజమైనా ఆరోగ్యవంతంగా నిలబడాలంటే వైద్యులు, నర్సులు, ఫార్మసిస్టులు సమాన సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. ఔషధ పరిజ్ఞానం కలిగిన ఫార్మసిస్ట్ శ్రమను గుర్తించడం అంటే ప్రజా ఆరోగ్యాన్ని సురక్షితం చేయడమే. మందుల సృష్టికర్తలుగా, రోగ ఉపశమన మిత్రులుగా రాత్రింబవళ్ళు శ్రమిస్తున్న ఫార్మసిస్టుల సేవలను స్మరించుకుంటూ, ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25న జరుపుకునే ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా వారి ప్రాముఖ్యతను గుర్తించడం, గౌరవించడం, వారికీ తగిన సాధికారతను అందించడం సమాజంలోని ప్రతి పౌరుడి, ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం.

**- యండి. ఉస్మాన్ ఖాన్**
9912580645

# వర్షాన్ని లెక్కచేయకుండా నిమజ్జన కార్యక్రమాలు



యు.కొత్తపల్లి సెప్టెంబర్ 24(మనం న్యూస్): వర్షాన్ని సైతం లెక్కచేయకుండా యు.కొత్తపల్లి మండలంలో గణనాథుల నిమజ్జన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఉప్పాడ శివారు కొత్తపట్నానికి చెందిన అగ్రికుల క్షత్రియుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడికి నవరాత్రులు ముగియడంతో గురువారం నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. సుబ్బంపేట సమీపంలోని సముద్రతీరం వరకు గణనాథుడిని గ్రామాల్లో ఊరేగింపుగా తీసుకువచ్చారు. డీజే ఏర్పాటు చేసి యువత ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ 'గణపతి బప్పా మోరియా' అంటూ నినాదాలు చేశారు.వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు, యువత పెద్ద సంఖ్యలో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలం లోని పలు ప్రాంతాల నుంచి గణపతి విగ్రహాలు సముద్రతీరానికి తరలిరావడంతో సుబ్బంపేట, ఉప్పాడ తీర ప్రాంతాల్లో సందడి నెలకొంది. నిమజ్జన కార్యక్రమా లు అధిక సంఖ్యలో జరుగుతు న్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.

# టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు విస్తృతంగా పర్యటన

## దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, పంట పొలాల పరిశీలన

## పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు

టెక్కలి సెప్టెంబర్ 24: టెక్కలి నియోజకవర్గంలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విస్తృత పర్యటన చేశారు. టెక్కలి మండలం పరిధిలోని మెలియాపుట్టి రహదారిని పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం విస్తృతంగా పరిశీలించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు.తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రహదారులను స్వయంగా పరిశీలించారు. రహదారుల పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, రహదారులు, భవనాల శాఖల అధికారులతో పరిస్థితిపై సమీక్షించి, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా పనులను



వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.పాడైన రహదారులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు, కొత్త రహదారుల ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లోని అన్ని గ్రామాలకు నూతన రహదారులు వేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని రహదారులు, పంచాయతీరాజ్, ఐటీడీఏ అధికారులకు సూచించారు.

నందిగామ మండలం కొత్త అగ్రహారం వద్ద తుఫాన్ ప్రభావంతో కూలిపోయిన వంతెనను మంత్రి పరిశీలించారు. వంతెన పునర్నిర్మాణానికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని ఆదేశించారు. వర్షాలతో వ్యవసాయ పొలాల్లో చేరిన నీటిని కూడా మంత్రి పరిశీలించారు. పంట పొలాల్లో నీటి నిల్వలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రాంతాల్లో నిలిచిన నీరు బయటకు వెళ్లేలా కాలువలు, నీటి మార్గాలను సరిచేయాలని అధికారులకు సూచించారు. రైతులకు నష్టం కలగకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, అఇ చైర్మన్ శేషగిరిరావు, తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,

# ధర్మనగర్లో వర్షపు నీరు ఇళ్లలోకి

- ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తక్షణ స్పందన



విశాఖపట్నం, సెప్టెంబర్ 24: అర్ణబ్ తుపాను ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం ₹55వ వార్డు ధర్మనగర్₹లో పలు ఇబ్బందులు తలెత్తాయి. ముఖ్యంగా ఓ ఇంటి పైకప్పు కారడంతో పాటు, వర్షపు నీరు ఇంట్లోకి చేరడంతో బాధిత కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది.

ఈ విషయం ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ ₹ పి. విష్ణుకుమార్ రాజు₹ దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించడంతో పాటు, వర్షపు నీరు ఇళ్లలోకి చేరకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, బాధిత కుటుంబాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు

## 30, 41 వార్డుల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పర్యటన

విశాఖపట్నం, సెప్టెంబర్ 24: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో దక్షిణ నియోజకవర్గంలోని 30, 41 వార్డుల పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు ₹ వంశీకృష్ణ శ్రీనివాస్₹ గురువారం జోరువానలో పర్యటించారు. జ్ఞానాపురం, ఎర్రిగడ్డ పరిసర ప్రాంతాలతో పాటు 30వ వార్డులోని ₹వార్డు బాయ్ లైన్₹ ప్రాంతాల్లో పర్యటించి స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీటితో జలమయమైన ఇళ్లను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. ఎర్రిగడ్డ ప్రాంతంలో అధికారులతో కలిసి జరుగుతున్న పనులను పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గెడ్డల్లో పేరుకుపోయిన పూడికను ఎప్పటికప్పుడు తొలగిస్తూ నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని సూచించారు.

### వార్డు బాయ్ లైన్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ వార్డు బాయ్ లైన్ ప్రజలు ఎన్నో ఏళ్లుగా



ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలో వెలంపేట-లక్ష్మీనగర్లో నిర్మిస్తున్న గృహాల తరహాలోనే వార్డు బాయ్ లైన్ ప్రాంతంలో కూడా త్వరలో గృహ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వార్డు బాయ్ లైన్ను గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి, స్థానిక ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు శాశ్వత ఊరట కలిగించేలా కూటమి ప్రభుత్వం తరఫున ప్రత్యేక చర్యలు చేపడతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మండల ప్రత్యేక అధికారిగా ఆనందరావు బాధ్యతలు



యు. కొత్తపల్లి సెప్టెంబర్ 24 ( మనం న్యూస్): మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా కాకినాడ జిల్లా సివిల్ సప్లయిస్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎం. ఆనందరావు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన మండల ప్రత్యేక అధికారిగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ లక్ష్మీరెడ్డి, తహసీల్దార్ చిన్నారావు ఆయనను సాదరంగా ఆహ్వానించి మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి, పరిపాలనా కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేక అధికారికి వివరించారు.

# మత్స్యకారులకు భద్రతా పరికరాల పంపిణీ



యు. కొత్తపల్లి సెప్టెంబర్ 24 ( మనం న్యూస్): మత్స్యకారులు వేటకు వెళ్లే సమయంలో ఉపయోగపడే పరికరాలను పిఠాపురం నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి పవన్కల్యాణ్ చేతుల మీదుగా పలువురు మత్స్యకారులకు అందజేశారు. మిగిలిన పరికరాలను బుధవారం ఉప్పాడ పంచాయతీ కార్యాలయం వద్ద ఉప్పాడ జనసేన పార్టీ ఇన్చార్జి గంటా విజయ్కుమార్ మత్స్యకారులకు అందజేశారు. ఈ సందర్భంగా గంటా విజయ్కుమార్ మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. సముద్రంలో వేటకు వెళ్లే సమయంలో మత్స్యకారుల భద్రతకు ఉపయోగపడే పరికరాలను అందించడం ద్వారా వారికి భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

# నౌకపై దాడిలో భారతీయుడి మృతి

ఢిల్లీ, సెప్టెంబర్ 24 : భారత్ కు వస్తున్న ఓ సరకు రవాణా నౌకపై ఒమన్ తూర్పు తీరంలో జరిగిన దాడిలో ఒక భారతీయుడు మృతి చెందారు. ఎంవీ కేప్ దావో అనే ఆ నౌకలో 20 మంది భారతీయులున్నారు. 'ఈ దాడిలో భారతీయుడు మరణించడంపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాం. ఆయన కుటుంబానికి మా సానుభూతిని తెలియజేస్తున్నాం. ఆర్పీఎస్ఎల్తోనూ, మృతుడి కుటుంబంతోనూ మాట్లాడుతున్నాం' అని ఒమన్లోని భారతీయ ఎంబసీ పేర్కొంది. నౌకపై ఎవరు దాడి చేశారనేది వెల్లడి కాలేదు.

# క్రమశిక్షణ, ప్రణాళికతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

## మధురువాడ ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హాస్టల్ సందర్శనలో కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

## చిన్నారి బర్త్ డే సందర్భంగా కేక్ కట్ చేసి.. వారితో కలిసి భోజనం చేసిన కలెక్టర్

విశాఖపట్నం, సెప్టెంబర్ 24: భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలంటే విద్యార్థులు క్రమశిక్షణతో మెలగడంతో పాటు, స్పష్టమైన ప్రణాళిక, విజన్తో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సూచించారు. మధురవాడలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హాస్టల్ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్లోని వసతి, భోజనం, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హాస్టల్లోని ఒక చిన్నారి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. స్టడీ అవర్లో విద్యార్థులతో




కలెక్టర్ ప్రత్యేకంగా ఇంటరాక్ట్ అయ్యారు. వారి చదువులు, భవిష్యత్ లక్ష్యాలు, ఆసక్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడి, వారి సందేహాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీరు కూడా నా లాగా కలెక్టర్ స్థాయికి ఎదగాలి. భవిష్యత్తులో మీలాంటి పిల్లలతో మీరు కూడా ఇలాగే ఇంటరాక్ట్ అయి, వారిని ప్రోత్సహించే స్థాయికి చేరుకోవాలి అని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా నిరంతరం కృషి చేయాలని సూచించారు. సమయపాలన, క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధమైన చదువు, స్పష్టమైన లక్ష్యం విజయానికి ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని, తల్లిదండ్రులు, గురువులు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఇన్చార్జి డీడీ సత్యపద్మ, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, హాస్టల్ వార్డెన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 1న మధ్యాహ్నం పింఛన్ల పంపిణీ

- డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి వెల్లడి

విశాఖపట్నం, సెప్టెంబర్ 24: రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ నెల పింఛన్ల పంపిణీకి సంబంధించి రాష్ట్ర ఉన్నతాధికారులు మార్గదర్శకాలు జారీ చేశారని డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పింఛన్ల పంపిణీ కోసం రూ.2,675.63 కోట్ల నిధులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 2026 నెలకు సంబంధించిన పింఛన్ల విడుదల డేటాను అక్టోబర్ నెలలో పంపిణీ చేసేందుకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అక్టోబర్ 1వ తేదీ ఉదయం బ్యాంకుల నుంచి అవసరమైన నగదును ఉపసంహరించుకోవాలని, అదే రోజు మధ్యాహ్నం పింఛన్ల పంపిణీ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. పంపిణీకి అవసరమైన నగదు సంబంధిత బ్యాంకు శాఖల్లో ముందుగానే అందుబాటులో ఉండేలా బ్యాంకు కంట్రోలర్లు, ఎల్డీఎంలు సమన్వయం చేసుకోవాలన్నారు. ఎంపీడీవోలు, జోనల్ కమిషనర్లు, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది సంబంధిత బ్యాంకు శాఖలకు ముందస్తుగా సమాచారం అందించి, అవసరమైన నగదు ఏర్పాటుకు సమన్వయం చేసుకోవాలని డీఆర్డీఏ పీడీ ఆదేశించారు. ఎన్ఎస్ఏపీ కేంద్ర వాటా పింఛను మొత్తాన్ని డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని చెప్పారు.

# పార్టీకి అంకితభావంతో చేసిన సేవలకు గుర్తింపు



- పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లో నాయకులు, కార్యకర్తల అభినందనలు

పోడూరు, సెప్టెంబర్ 24, మనం ప్రతినిధి: పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లో కీలక వైసీపీ నేతగా గుర్తింపు పొందిన, పోడూరు జడ్పీటీసీగా ఇటీవల పదవీకాలం పూర్తి చేసుకున్న గుంటూరి పెద్దిరాజును వైఎస్సార్సీపీ పార్లమెంటరీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి గురువారం ఆదేశాలు జారీ చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి వైఎస్సార్సీపీని అంటిపెట్టుకుని, ఆచంట నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి గుంటూరి పెద్దిరాజు నిరంతరం కృషి చేశారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, పార్టీ కోసం అంకితభావంతో పనిచేశారు. కష్టకాలంలోనూ పార్టీకి అండగా నిలిచి, పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేసిన ఆయన సేవలను గుర్తించిన అధిష్ఠానం రాష్ట్రస్థాయి బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. పోడూరు జడ్పీటీసీగా ప్రజలకు అందించిన సేవలు, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర, నాయకులు-కార్యకర్తలతో సత్సంబంధాలు ఆయనకు ఈ బాధ్యత దక్కడంలో కీలకంగా నిలిచాయి. ఆచంట నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్, మాజీ మంత్రి చెరకువాడ శ్రీరంగనాథరాజు, పాలకొల్లు నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్ గుడాల గోపి, రెండు నియోజకవర్గాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గుంటూరి పెద్దిరాజును అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# డేటా సెంటర్ పనులకు ఉన్నత సాంకేతికత అవసరం: గంటా

విశాఖపట్నం , మనం న్యూస్ : జాతీయ రహదారి నుంచి తర్లువాడ గూగుల్ డేటా సెంటర్ కు మెరుగైన సాంకేతికతతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. ప్రతిష్టాత్మక డేటా సెంటర్ పనుల విషయంలో తగిన జాగ్రత్త వహించాలన్నారు. వర్షానికి బ్రిడ్జి పనులు కొట్టుకుపోవడం, ముడసర్లోవ దగ్గర గూగుల్ పనుల్లో ప్రహరీ కూలిపోవడం గురించి జిల్లా కలెక్టర్ తో మాట్లాడానని తెలిపారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా ఆనందపురం, మధురవాడలలో దెబ్బ తిన్న ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాల కారణంగా కొండ వాలు, లోతట్టు ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని.. ఎక్కడికక్కడ షెల్టర్లు ఏర్పాటు చేసి తాగునీరు, భోజన, వసతి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించామన్నారు. వర్షం కొనసాగే అవకాశం ఉన్నందున రాబోయే 2




రోజులు అప్రమత్తంగా ఉండాలని, 24 గంటలు పని చేసే కంట్రోల్ రూంల సాయాన్ని తీసుకోవాలని ప్రజలకు సూచించారు.



## ఇరగవరం మండల ప్రత్యేక అధికారిగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

**ఇరగవరం, సెప్టెంబర్ 24, మనం ప్రతినిధి:** ఇరగవరం మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా వయోజన విద్యా ఉపసంచాలకులు కె.వి.వి. సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షుల పదవీకాలం సెప్టెంబర్ 23తో ముగియడంతో, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం-1994లోని 250-ఏ నిబంధన ప్రకారం మండల ప్రజా పరిషత్లకు ప్రత్యేక అధికారులను నియమించారు. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు సత్యనారాయణ ఇరగవరం మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ విషయాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ. శ్రీనివాసు తెలిపారు.

## కిర్లంపూడి ప్రత్యేక అధికారిగా శ్రీనివాసరెడ్డి బాధ్యతల స్వీకరణ

### కలెక్టర్ ఉత్తర్వుల మేరకు పదవీ బాధ్యతలు చేపట్టిన జిల్లా సహకార శాఖాధికారి

**కిర్లంపూడి, సెప్టెంబర్ 24( మనం న్యూస్ ):** .మండల ప్రజా పరిషత్ 6వ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో కిర్లంపూడి మండల ప్రత్యేక అధికారిగా కాకినాడ జిల్లా సహకార శాఖాధికారి శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.కలెక్టర్ ఆదేశాల ప్రకారం గురువారం కిర్లంపూడి మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా శ్రీనివాసరెడ్డి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. మండలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగేలా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## జట్లపాలెంలో విషాదం..
# అన్నదమ్ములు మృతి

**పెంటపాడు సెప్టెంబర్ 24 మనం న్యూస్ :** పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం జట్లపాలెం గ్రామంలో గురువారం విషాదకర ఘటన చోటు చేసుకుంది. నూతనంగా నిర్మించిన ఇంటి వద్ద ఆడుకుంటూ అనుకోకుండా కరెంటు ఎర్త్ వైర్ పట్టుకోవడంతో గండికోట సూర్య (14), సాయి (12) విద్యుత్ షాక్ తో మతి చెందారని గ్రామస్తులు తెలిపారు . సూర్య 8వ తరగతి, సాయి 6వ తరగతి చదువుతున్నారు. చిన్నారుల అకస్మిక మతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. జట్లపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## జర్నలిస్టులకూ గౌరవ వేతనం ఇవ్వాలి

**పాలకొల్లు, సెప్టెంబర్ 24,మనం ప్రతినిధి:** సోషల్ మీడియా ఇన్ఫ్లెన్సర్లకు రూ. 2500 నుంచి రూ.15000 వరకు ప్రభుత్వ సొమ్మును ధారాధాత్తం చేస్తున్న విధంగానే దశాబ్దాల కాలంగా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్యన వారధిగా ఉంటూ ప్రజాసేవలో నిత్యం పరితపిస్తున్న పాత్రికేయులుకు కూడా గౌరవ వేతనం ఇవ్వాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు కోరుతున్నారు.

ఐదు సంవత్సరాలుగా సేవలందిస్తున్న జర్నలిస్టులకు నెలకు రూ. 5000/-, 10 సంవత్సరాలుగా సేవలందిస్తున్న జర్నలిస్టులకు నెలకు రు.10000/-, పది సంవత్సరాలు పైబడి 20 సంవత్సరముల వరకు పైబడిన వారికి నెలకు రూ. 25 వేలు చొప్పున, అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లో విశ్రాంత జర్నలిస్టులకు ఇస్తున్న విధంగా ఏపీలో కూడా జర్నలిస్టులకు నెలకు రూ. 15000/- చొప్పున పింఛన్లు, డెత్ బెనిఫిట్ లు అందజేయాలని కోరుతున్నారు. దశాబ్దాలు తరబడి సేవలందిస్తున్న పాత్రికేయులకు ముందుగా చెల్లించిన తర్వాతే ఇటీవల వచ్చిన సోషల్ మీడియాకు ఇవ్వడం న్యాయసమతంగా ఉంటుం దని పలువురు సీనియర్ జర్నలిస్టులు వ్యాఖ్యానిస్తున్నారు. కావున సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రులు నారా లోకేష్ ఈ దిశగా చర్యలు తీసుకోవాలని పాత్రికేయులు పలువురు కోరుతున్నారు.

## వానలోనూ వీడని వీఆర్ఏల దీక్ష



- వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కార్యాలయానికి వచ్చిన ప్రజల ఆకాంక్ష

**పోడూరు, సెప్టెంబర్ 21, మనం ప్రతినిధి:** తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ పోడూరు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు చేపట్టిన నిరాహారదీక్ష భారీ వర్షంలోనూ కొనసాగుతోంది. తుఫాను ప్రభావంతో వర్షం కురుస్తున్నప్పటికీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా తొమ్మిదో రోజు వీఆర్ఏలు దీక్షలో కూర్చున్నారు. వర్షం నుంచి రక్షణ లేకపోయినా తమ డిమాండ్ల సాధన కోసం దీక్షను కొనసాగిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వస్తున్న ప్రజలు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వీఆర్ఏలు దీక్ష కొనసాగిస్తున్న తీరును చూసి వారి పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వీఆర్ఏలు ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లోనూ నిరసన కొనసాగించాల్సి వస్తోందని పలువురు పేర్కొంటూ, ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు వేతన శ్రేణి అమలు చేయడం, నామినీ వీఆర్ఏలుగా పనిచేస్తున్న వారికి పదోన్నతి కోటాను 30 శాతం నుంచి 70 శాతానికి పెంచడం, కారుణ్య నియామకాలు చేపట్టడం తదితర ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని వీఆర్ఏలు కోరుతున్నారు. వర్షం కురుస్తున్నా దీక్షను విరమించకుండా తమ సమస్యల పరిష్కారం కోసం వీఆర్ఏలు పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.



## పాలకొల్లు సర్కిల్ పరిధిలో 100% మద్యం దుకాణాల లైసెన్సుల పునరుద్ధరణ

- సీఐ రామ శేషయ్య వెల్లడి

**పాలకొల్లు, సెప్టెంబర్ 24(మనం ప్రతినిధి):** పాలకొల్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న మొత్తం 21 మద్యం దుకాణాలకు గాను 21 లైసెన్సుల పునరుద్ధరణ (రెన్యువల్ ) ప్రక్రియ పూర్తయినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ మద్ది రామ శేషయ్య గురువారం ఒక ప్రకటన లో తెలిపారు.

ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం నిర్వహించిన లైసెన్సుల పునరుద్ధరణ ప్రక్రియలో పాలకొల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఓపెన్ కేటగిరీ 19 షాపులకుగాను19మంది,గీత కులాలకు చెందిన 2 షాపులకు గాను ఇద్దరు (02) లైసెన్సీలు తమ తమ లైసెన్సులను పునరుద్ధరించుకున్నట్లు (రెన్యువల్ )ఆయన వెల్లడించారు.పాలకొల్లు రూరల్ మండలం (4),పాలకొల్లు టౌన్ (7),ఆచంట మండలం (5),పోడూరు మండలం (5) మొత్తం 21/21 షాపుల రెన్యువల్ పూర్తయ్యిందని రామ శేషయ్యా తెలిపినారు.

## జర్నలిస్టుల దేశ వ్యాప్తంగా ఆందోళన

### 2న డిమాండ్స్ డే పాటించాలని ఐజేయూ పిలుపు

**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 24 మనం న్యూస్ :** వర్కింగ్ జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున దేశ వ్యాప్తంగా 'కోర్కెల దినం' పాటించాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ ( ఐజేయూ ) పిలుపునిచ్చింది. ఆ రోజున వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని ఐజేయూ జాతీయ అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్మూ , సెక్రటరీ జనరల్ డి.సోమసుందర్ ప్రకటన విడుదల చేశారు. మీడియా సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకునే విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ రాష్ట్రపతి (ద్రౌపది ముర్ముకు వినతిపత్రం పంపించాలని అనుబంధ రాష్ట్ర సంఘాలను కోరింది. జాతీయ స్థాయి సమస్యలతో పాటు ఆయా రాష్ట్రాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ ముఖ్య మంత్రులకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వినతి పత్రాలు అందచేయాలని పిలుపునిచ్చింది. కేంద్ర ప్రభుత్వం వెంటనే మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక జాతీయ చట్టం తీసుకురావాలని, నూతన వేతన బోర్డు ఏర్పాటు చేయాలని నేతలు పేర్కొన్నారు.

## భారీ వర్షాలతో నిండుతున్న సుబ్బారెడ్డి సాగర్

### సాగునీటిపై రైతుల్లో చిగురించిన ఆశలు



**ప్రత్తిపాడు సెప్టెంబర్ 24 (మనం న్యూస్)ః** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు సుబ్బారెడ్డి సాగర్కు భారీ వర్షాలతో జలకళ వచ్చింది.కొంతకాలంగా వర్షాభావ పరిస్థితులతో సాగునీటి లభ్యతపై రైతుల్లో ఆందోళన నెలకొంది.ఎల్నినో ప్రభావం నేపథ్యంలో సాగునీటి అవసరాలకు నీటిని వినియోగించరాదంటూ జిల్లా కలెక్టర్ సైతం ఆదేశాలు జారీ చేశారు.తాజాగా కురిసిన భారీ వర్షాలతో సుబ్బారెడ్డి సాగర్లోకి భారీగా వరదనీరు చేరింది.దీంతో సాగర్లో నీటి మట్టం గణనీయంగా పెరిగి కళకళలాడుతోంది.సాగర్కు జలకళ రావడంతో పరిసర ప్రాంతాల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

వర్షాలు ఇలాగే కొనసాగితే సుబ్బారారెడ్డి సాగర్లో నీటి నిల్వలు మరింత పెరిగి పంటల సాగుకు ఉపయోగపడతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ పరిశీలన



**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 24 మనం న్యూస్ :** తుఫాను ప్రభావంతో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ నాగరాణి గురువారం పరిస్థితులను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలు, వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల పరిస్థితులను సమీక్షించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం తాడేపల్లిగూడెం డంపింగ్ యార్డ్ను పరిశీలించి పారిశుద్ధ్య నిర్వహణ పై అధికారులకు పలు సూచనలు చేశారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, తుఫాను ప్రభావం పూర్తిగా తగ్గే వరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కమిషనర్ ఏసుబాబు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతానికి ఇద్దరు పిల్లలు మృతి



**పెంటపాడు సెప్టెంబర్ 24(మనం న్యూస్):** విద్యుత్ ఘాతానికి ఇద్దరు పసికందులు పెంటపాడు మండలం జట్లపాలెం గ్రామంలో గురువారం దుర్మరణం చెందారు. స్థానికుల కథనం ప్రకారం జర్లపాలెం గ్రామంలో కొండేటి ప్రసాద్ అనే అతను నూతనంగా గృహం నిర్మించుకుని ఆ గృహానికి విద్యుత్ చేసినా అనంతరం ఎర్త్ వైర్ ను వెలుపలే వదిలేసారని గ్రామస్తులు చెబుతున్నారు. గురువారం పాఠశాలకు సెలవు దినంగా ప్రకటించినందున సమయంలో అదే గ్రామానికి చెందిన సాయి అఖిల్ ( 12 ) సంవత్సరాలు 6వ తరగతి చదువుతున్నాడు. అతని స్నేహితుడు గండికోట సూర్య ప్రకాష్ ( 14) సంవత్సరాలు 8వ తరగతి చదువుతున్నాడు వీరిద్దరూ మధ్యాహ్నం సమయంలో ఆటలాడుకు నేందుకు ప్రసాద్ ఇంటి ప్రదేశమునకు వెళ్లి వెలుపల ఉన్న ఎర్త్ వైర్ ను ముందుగా సాయి అఖిల్ ఆ వైర్ ను తాకగా అతడు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతు దుర్మరణం చెందాడు. అది తెలియని ఆ పసికందు గండికోట సూర్యప్రకాష్ అఖిల్ ను పట్టుకోగా ఆ బాలుడు కూడా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తల్లిదండ్రులు , బంధువులు , మిత్రులు , గ్రామస్తులు రోదిస్తున్నారు.

## ఎమ్మెల్యే సత్యప్రభ కృషితో శంఖవరం రోడ్డుకు మహర్దశ



**ప్రత్తిపాడు, సెప్టెంబర్ 24 మనం ప్రతినిధిః** దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రహదారులకు మహర్దశ కల్పిస్తూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మరో ముందడుగు వేశారు.ఎమ్మెల్యే సత్యప్రభ కృషితో శంఖవరం మెయిన్ రోడ్డు అభివృద్ధికి డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ నిధుల నుంచి రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి.శంఖవరం ప్రధాన రహదారి అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు కావడంతో స్థానిక ప్రజల చిరకాల సమస్యకు పరిష్కారం లభించనుంది.రహదారి అభివృద్ధి పూర్తయితే ప్రజలు,వాహనదారుల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

రహదారి మెరుగుపడటం తో శంఖవరం ప్రాంతంలో మౌలిక వసతులు బలోపేతమై ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.ప్రత్తిపాడు నియోజకవర్గంలో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రహదారులను గుర్తించి వాటి అభివృద్ధికి ఎమ్మెల్యే సత్యప్రభ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తూ నియోజకవర్గ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నారు. శంఖవరం మెయిన్ రోడ్డు అభివృద్ధికి రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్,రాష్ట్ర మంత్రి నారా లోకేష్,కాకినాడ జిల్లా కలెక్టర్ ఎన్ హరేంధిర ప్రసాద్కు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల అవసరాలను గుర్తించి నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలియజేశారు




## ఆక్వా రైతు సమస్యల పరిష్కారం కోసం పలు తీర్మానాలు ఆమోదం

- రాష్ట్ర సంఘ అధ్యక్షులు గాంధీ భగవాన్ రాజు వెల్లడి

**పాలకొల్లు, సెప్టెంబర్ 24(మనం ప్రతినిధి):** ఆక్వా రైతులుఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ స్రి తర్వాత మ్పు అసోసియేషన్ తో కలిసి పలు తీర్మానాలు చేసినట్లు ఏపీ రాష్ట్ర ఆక్వా రైతు సంఘ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హేచరీస్ నాణ్యమైన సీడ్ ని సరఫరా చేసే విధంగాను, లక్ష సీడ్ కి 20 శాతంసీడ్ అదనంగా ఇచ్చే విధంగాను, ప్రతి రైతు సీడ్ టెస్ట్ చేయించి పట్టుకెళ్లే విధంగాను, రొయ్యల వ్యాధుల దృష్ట్యా ఏప్రిల్ 15 నుంచి మే 30 వరకు 45 రోజులు పాటు చెరువులను ఆరకట్టే విధంగా తీర్మానించినట్లు గాంధీ భగవాన్ రాజు వెల్లడించారు. ఈ సమావేశంలో డి సుబ్బరాజు, సిహెచ్ఎస్ సూర్య రావు, వివిఎన్ వర్మ, ఎస్ సూర్యనారాయణ, ఎన్ కళ్యాణ్, డాక్టర్ పివి నాగేశ్వరరావు, పి రాజ శేకర్ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

# స్లీపర్ బస్సులో మంటలు

- 9 మంది సజీవదహనం
- ప్రధాని దిగ్భ్రాంతి..
- రూ.2 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటన



**ఢిల్లీ, సెప్టెంబర్ 24 :** ఉత్తర ప్రదేశ్లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గ్రేటర్ నోయిడాలోని యమునా ఎక్స్ప్రెస్ వేపై స్లీపర్ బస్సుకు మంటలు అంటుకోవడంతో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఘటన వివరాలు...

స్లీపర్ టూరిస్ట్ బస్సు ఢిల్లీ నుంచి ఉత్తర్ ప్రదేశ్లోని మహోబావైపు వెళ్తుండగా యమునా ఎక్స్ప్రెస్ వే సమీపంలో మంటలు అంటుకున్నాయి. అవి వేగంగా బస్సు అంతా వ్యాపించాయి. ఆ సమయంలో అందులో 40 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రాణాలు కాపాడుకునేందుకు పలువురు బస్సు నుంచి దూకేశారు. కానీ, ఘటన జరిగినప్పుడు ప్రయాణికులు నిద్రలో ఉండటంతో 9 మంది మంటల్లో చిక్కుకొని దుర్మరణం పాలయ్యారు. మరికొందరు బస్సులో చిక్కుకొన్నారని తెలుస్తోంది. ఒక్కసారిగా తమచుట్టూ మంటలు వ్యాపించడంతో ప్రయాణికుల ఆక్రందనలతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది.

బస్సు దగ్ధమవుతోన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అగ్నిమాపక, ఇతర అత్యవసర సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. మంటలు వ్యాపించడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఉత్తర్ప్రదేశ్ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. పరిస్థితిని సమీక్షించారు.

**సిగరెట్ ఎంజాయ్ చేస్తూ కూచున్న డ్రైవర్..**

గ్రేటర్ నోయిడాలో బుధవారం అర్ధరాత్రి సమయంలో జరిగిన బస్సు ప్రమాదం ఎన్నో కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. యమునా ఎక్స్ప్రెస్వేపై బస్సు ప్రయాణిస్తుండగా చెలరేగిన మంటలు.. నిమిషాల వ్యవధిలోనే మొత్తం వ్యాపించాయి. కొందరు బస్సు దూకి ప్రాణాలు దక్కించుకోగా.. ఇంకొందరు మంటల్లో చిక్కుకొని సజీవ దహనమయ్యారు. తొమ్మిది మంది మృతుల్లో ఒక మహిళ కూడా ఉన్నారు.

స్లీపర్ బస్సు (ఖిజ్ఞాఖ్యఛట ఆఱు)లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని తొలుత భావించారు. డ్రైవర్, కండక్టర్ ను అదుపులోకి తీసుకున్నారు. ఎఫ్ఐఆర్ ప్రకారం.. బస్సు ప్రయాణం ప్రారంభించి 33 కి.మీ. దూరం వెళ్లిన తర్వాత డ్రైవర్ క్యాబిన్ నుంచి పొగ రావడాన్ని ప్రయాణికులు గుర్తించారు. కాలుతున్న వాసన వస్తోందని డ్రైవర్, కండక్టర్ను అప్రమత్తం చేశారు. కానీ, వారు పట్టించుకోలేదు, బస్సు ఆపి ఎలాంటి తనిఖీ చేయలేదని వెల్లడించారు. అప్పటికి కూడా వారిద్దరూ బస్సులో సిగరెటు తాగడం ఆపలేదు. కొద్ది నిమిషాలకే డ్రైవర్ సీట్ వద్ద ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దాంతో భయాందోళనకు గురైన ప్రయాణికులు బస్సు ఆపాలంటూ కేకలు వేశారు. అప్పటికి కూడా వారు వాహనాన్ని ఆపకపోగా.. బెదిరించారని ప్రయాణికులు వాపోయారు. ఆ తర్వాత బస్సు అంతటా వేగంగా మంటలు వ్యాపించి ప్రాణాలను బలిగొన్నాయి.

రాత్రి సమయం కావడంతో మేమంతా నిద్రపోతున్నాం. బస్సు మంటల్లో చిక్కుకుందని కొందరు మావద్దకు వచ్చి నిద్రలేపారు. మేం వెంటనే కిందికి దిగాం. బస్సు అంతా పొగ అలముకుంది'' అని మరో ప్రయాణికుడు వెల్లడించారు. ''బస్సు మంటల్లో చిక్కుకున్నప్పుడు నా చేతికి ఫోన్ మాత్రమే దొరికింది. దానిని తీసుకొని కిందికి దిగాను. మిగతా వస్తువులన్నీ లోపలే కాలిపోయాయి'' అని ఓ ప్రయాణికురాలు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ బస్సు యజమానిది మధ్యప్రదేశ్ అని పోలీసులు గుర్తించారు.

**ప్రధాని దిగ్భ్రాంతి.. రూ.2 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకట..**

ప్రధాని మోడీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు రూ.2లక్షల పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి రూ.50 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గురైన బస్సుపై రూ.1.75 లక్షల చలాన్లు పెండింగ్లో ఉన్నాయి. మైనర్ ఈ వాహనాన్ని నడిపినందుకు కూడా గతంలో అపరాధ రుసుం విధించారు.

## ఎడతెరిపి లేని భారీ వర్షం



- పెద్ద ఎత్తున ఈదురు గాలులు
- స్తంభించిన ప్రజా రవాణా
- ప్రధాన రహదారి నిర్మానిష్యం

**ఆచంట సెప్టెంబర్ 24 మనం న్యూస్ః** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఎడతెరిపిలేని భారీ వర్షం మరియు పెద్ద ఎత్తున ఈదురుగాలులు వీస్తుండడంతో నిత్యం రద్దీగా ఉండే కోడేరు... మార్టేరు ప్రధాన రహదారిలో ప్రజా రవాణా స్తంభించి ప్రధాన రహదారి నిర్మాణస్యంగా దర్శనం ఇచ్చింది విద్యార్థుల భద్రతపై దృష్టి సారించి ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థలకు జిల్లా అధికారులు సెలవు ప్రకటించారు దీంతో రహదారి వెంబడి వెళ్లి వచ్చే బస్సులు కాన్వెంట్ వ్యాన్లు ఎక్కడికక్కడే వాహనదారులు నిలిపివేశారు చిరు వ్యాపారుల ద్విచక్ర వాహనాలు సైతం రాకపోకలు కు తీవ్ర అంతరాయం కలగడంతో ఆగిపోయారు వ్యాపార వాణిజ్య దుకాణాలు మూతపడ్డాయి తుఫాను భారీ వర్షాలు ఈదురు గాలులు తగ్గుముఖం పట్టాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఉండాలని వరుణ దేవుడిని ప్రజలు వేడుకుంటున్నారు.

# చెత్త రాజకీయాలు మానుకోండి

● **వైసీపీ నేతలకు ఎమ్మెల్యే కాలవ హెచ్చరిక**



**రాయదుర్గం, సెప్టెంబర్ 24 మనం న్యూస్:** వైసీపీ నేతలు చెత్త రాజకీయాలు మానుకుని రాయదుర్గం అభివృద్ధిని చూడాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. రాయదుర్గం పట్టణంలోని డంపింగ్ యార్డులో జరుగుతున్న చెత్త శుద్ధీకరణ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. దశాబ్దాలుగా పట్టణంలో పేరుకుపోయిన సుమారు లక్ష టన్నుల చెత్తను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శుద్ధి చేస్తోందన్నారు. ఇప్పటివరకు 87 వేల మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేశామని, మిగిలిన చెత్తను మరో మూడు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు. భవిష్యత్తులో డంపింగ్ యార్డును పరిశుభ్రమైన ప్రదేశంగా తీర్చిదిద్ది, ఆహ్లాదకరమైన పార్కును అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యధిక నిధులు తీసుకొచ్చి రాయదుర్గం అభివృద్ధికి కృషి చేస్తుంటే, వైసీపీ నేత మెట్టు గోవిందరెడ్డి చెత్త అంశంపై రాద్ధాంతం చేస్తూ పట్టణ ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. గడచిన రెండేళ్లలో చెత్త శుద్ధీకరణకు కూటమి ప్రభుత్వం చేసిన ఖర్చు కంటే, ఐదేళ్ల వైకాపా పాలనలో రాయదుర్గం అభివృద్ధికి చేసిన ఖర్చు చాలా తక్కువని గణాంకాలతో వివరించారు. డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను శుద్ధీకరించేందుకు రూ.8.54 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పట్టణంలో రోజువారీగా ఉత్పత్తి అవుతున్న సుమారు 29 మెట్రిక్ టన్నుల చెత్త తరలింపు, మరుగుదొడ్ల వ్యర్థాలను శుద్ధీకరించేందుకు మరో రూ.4.47 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్లలో రాయదుర్గం పట్టణంలో చెత్త తొలగింపునకు భవిష్యత్తులో వచ్చే చెత్తను శుభ్రపరచడానికి సుమారు రూ.13.03 కోట్లు ఖర్చు చేయగా, ఐదేళ్ల వైకాపా ప్రభుత్వం రాయదుర్గం అభివృద్ధికి ఖర్చు చేసింది కేవలం రూ.10.27 కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. వైకాపా ఐదేళ్ల పాలనలో రాయదుర్గం పట్టణానికి రూ.31.31 కోట్లు మంజూరు కాగా, రూ.8.15 కోట్ల విద్యుత్ బిల్లులు చెల్లించారని తెలిపారు. మరో రూ.10.27 కోట్లను రోడ్లు, మురుగునీటి కాలువలు, వీధి దీపాలపై ఖర్చు చేశారని పేర్కొన్నారు. నాడు-నేడు కింద రూ.6.74 కోట్లు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు మరో రూ.2.40 కోట్లు మాత్రమే వచ్చాయని తెలిపారు. వాస్తవాలు, లెక్కలను వివరించేందుకు తెలుగుదేశం పార్టీ సిద్ధంగా ఉందని, బహిరంగ చర్చకైనా లేదా ఇన్కెమెరా సమావేశంలో చర్చించడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. రాయదుర్గం అభివృద్ధి తెలుగుదేశం పార్టీ సొంతమని, ప్రజల దీవెనలతో, చంద్రబాబు ఆశీస్సులతో రాయదుర్గం పట్టణాన్ని ఇతర పట్టణాలకు ఏ విధంగానూ తీసిపోని విధంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. రాయదుర్గం అభివృద్ధిని కోరుకునే పట్టణ ప్రజలు తమకు తోడుగా ఉండి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తం, మాజీ చేనేత డైరెక్టర్ టౌకశాల హనుమంతు,మాజీ కౌన్సిలర్లు కడ్డీపుడి మహబూబ్ బాషా,బుదురు తిప్పేస్వామి, రావుత్ రాజశేజర్,భలే శంకర్,గుద్దిటి లోకేష్,మోపురి అశోక్,పోరాళ్ల ధనర్జున,బంగి శంకర్, ఆటో వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

● **ఎమ్మెల్యే అమిలినేని**



**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 24 మనం న్యూస్:** సమస్యలతో ప్రజలు నిత్యం కార్యాలయాల చుట్టు తిరగకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. గురువారం ప్రజావేదిక నందు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు . స్థానిక నాయకులతో కలసి ప్రజాధర్బార్ నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానికంగా ప్రజల సమస్యలను తెలుసుకుని అక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపించారు.అంతే కాకుండా కామక్కపల్లి, దురదకుంట, మానిరేవు, కళ్యాణదుర్గం పట్టణంలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణం చేసుకునేలా చూడాలని స్థానిక తహసీల్దార్ ను పిలిచి స్థలం ఉన్న చోట అర్హులైన లబ్ధిదారులకు స్థలం కేటాయించాలని, ప్రభుత్వ స్థలం లేని చోట ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి భూమి తీసుకునేలా ప్రతిపాదనలు పంపాలని, ఆలస్యం చేయకుండా సిద్ధం చేయాలని, అలాగే రెవెన్యూ సమస్యలతో వచ్చే పేదలను ఇబ్బంది పెట్టకుండా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని సూచించారు.తాగునీటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఎంపీడీఓలకు ఫోన్ ద్వారా తెలుపగా, విద్యుత్ సమస్యలు తలెత్త కూడా చూసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు.

# చెరువును తలపిస్తున్న మండ్లం రోడ్డు



**జూపాడు బంగ్లా, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** అధికారులకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు హెచ్చరిక..జూపాడు బంగ్లా మండలం లోని మండ్లం గ్రామంలో కేజీ రహదారి నడిబొడ్డున జలమయంతో నిండిపోయి చరువును తలపిస్తుందని వాహనదారులకు ప్రజలకు చాలా ఇబ్బందులు గురవుతున్నారని పరిష్కరించాల్సిన అధికారులు అటువైపు చూసిన పరిస్థితి లేదని తక్షణమే సమస్య పరిష్కరించాలని లేనిపక్షంలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామని సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు హెచ్చరించారు.. వరం కరువును తలపిస్తున్న రోడ్డును పరిశీలించి వరి నారు నాటి నిరసన తెలిపారు.

# నాణ్యతతో అభివృద్ధి పనులు చేయాలి

● **ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి**

**బేతంచేర్ల సెప్టెంబర్ 24 (మనం న్యూస్)** పట్టణంలో 86.5 కోట్ల తో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి శంకుస్థాపన భూమిపూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం కోట్లతో నిధులు ఇస్తున్నారు వారిఆదేశాల మేరకు అభివృద్ధికి పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు ఈ నిధులతో సి.సిరోడ్లు లైటింగ్ డ్రైన్ల నిర్మాణం అమృత్ 2.0 పథకం ద్వారా తాగునీటి వసతులు కాలువల అభివృద్ధి నగర్ పంచాయతీ భవన నిర్మాణం తదితర మౌలిక వసతుల పనులు చేపట్టనున్నారు పట్టణంలో మౌలిక వసతులను మరింత చేసి ప్రజలకు మెరుగైన రహదారులు తాగునీరు డ్రైనేజీ లైటింగ్ వంటి సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు 86.5 కోట్ల విలువైన అభివృద్ధి పనులతో బేతంచర్ల పట్టణ రూపు



రేఖలు మరింత మారనున్నాయని ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబా టులోకితీసుకురావాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు ప్రతిపక్ష పార్టీ వైసీపీ ప్రభుత్వం స్థానిక ఎన్నికలలో గెలుస్తామని పగటి కలలు కంటున్నారు మా ప్రభుత్వం ప్రజలకు ఇబ్బంది లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని అన్నారు ఈ కార్య క్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులు కూటమి నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# రీసర్వే ప్రక్రియ లక్ష్యాలకు అనుగుణంగా పురోగతి సాధించాలి

● **హౌసింగ్ ఫర్ ఆల్ కింద మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలి**

● **జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



**కర్నూలు, సెప్టెంబర్ 24 మనం న్యూస్:** రీసర్వే ప్రక్రియలో లక్ష్యాలకు అనుగుణంగా పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రీ సర్వే, సర్ ప్రక్రియ, పెన్షన్, అక్షరాంధ్ర, తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియ లో నిర్దేశించిన రోజువారీ లక్ష్యాలను సాధించేలా ప్రతి అధికారి తన పరిధిలోని గ్రామాలు, బృందాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియను పూర్తి స్థాయిలో వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలన్నారు.. బల్క్ భూ సమస్యల సంఖ్యను సక్రమంగా నమోదు చేయాలని, కొత్తగా గుర్తించే భూ సమస్యలను కూడా జాబితాలో చేర్చాలని కలెక్టర్ స్పష్టం చేశారు..ఈ-ఆఫీస్ అమలును పూర్తిస్థాయిలో చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బల్క్ ఇష్యూస్, ఈ-ఆఫీస్ అమలు, మ్యుటేషన్లు సంబంధిత ప్రతిపాదనలు సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేయాలన్నారు.కోర్టు కేసుల్లో జాప్యం ఉండకూడదని, ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్దేశిత గడువులోగా సమాధానాలు సమర్పించాలని కలెక్టర్ తహసిల్దార్ లను ఆదేశించారు. హౌసింగ్ ఫర్ ఆల్ కింద అర్హులైన లబ్ధిదారులను ఇప్పటికే ఉన్న లేఅవుట్లలో మ్యాపింగ్ చేయడాన్ని అక్టోబర్ 7లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మ్యాపింగ్ పూర్తయిన అనంతరం మిగిలిన అర్హుల కోసం ప్రభుత్వ భూములను గుర్తించడం, అవసరమైన చోట పట్టా భూములను గుర్తించడం, భూసేకరణ అవసరమైతే ప్రతిపాదనలు సిద్ధం చేసి అక్టోబర్ 15లోగా సంబంధిత ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ ఆర్డీఓ లను ఆదేశించారు. సర్ ప్రక్రియలో భాగంగా పెండింగ్లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను రేపు సాయంత్రానికల్లా పరిష్కరించాలని కలెక్టర్ ఏఈఆర్ఓ లను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రావు, జిల్లా స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు అధికారి భాస్కర్ నాయుడు, అడల్ట్ ఎడ్యుకేషన్ డిడి చంద్రశేఖర్ రెడ్డి, ఈ ఆర్వో లు, ఏ ఈఆర్వోలు, ఎంపిడిఓ లు, పాల్గొన్నారు.

# రూ.7.20 కోట్లతో పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధి పనులు


**పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర, కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి**

**పుట్టపర్తి, సెప్టెంబర్ 24మనం న్యూస్:** పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో రూ.7.20 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు గురువారం భూమిపూజ, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆర్టీసీ డిపో సమీపంలో రూ.48 లక్షలతో నిర్మించిన గోకులం మినీ పార్కును ప్రారంభించారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో సుమారు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ఆహార పార్కును ప్రారంభించారు. పుట్టపర్తి సంత మార్కెట్ రోడ్డులో రూ.20 లక్షలతో చేపట్టనున్న స్మశానవాటిక ప్రహరీ, మురుగునీటి కాలువ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కర్ణాటక నాగేపల్లి రోడ్డులో రూ.17.50 లక్షలతో మురుగునీటి కాలువ, సీసీ



రోడ్డు నిర్మాణానికి, సాయినగర్లో రూ.22.50 లక్షలతో సీసీ రోడ్డు, భూగర్భ మురుగునీటి వ్యవస్థ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చిత్రావతి రోడ్డులో రూ.4.25 కోట్లతో నిర్మించనున్న మున్సిపల్ కార్యాలయానికి భూమిపూజ నిర్వహించారు. అదే ప్రాంతంలో 4.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న బహుళ క్రీడా ఇండోర్ స్టేడియం పనులకు కూడా భూమిపూజ చేశారు. ఎనుములపల్లి ఎస్సీ కాలనీలో రూ.39.70 లక్షలతో, బ్రాహ్మణపల్లి ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో చేపట్టనున్న మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. బ్రాహ్మణపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.6.50 లక్షలతో నూతన బోరు, పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రూ.1 కోటి వ్యయంతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. బడే నాయక్ తండాలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.6.50 లక్షలతో నూతన బోరు బావి తవ్వకానికి, మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.23.50 లక్షలతో నూతన బోరు బావుల తవ్వకానికి భూమిపూజ నిర్వహించారు. పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పుట్టపర్తి ప్రాంతంలో సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడితో ఐదో తరం యుద్ధ విమానాల పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. పెడబల్లి పంచాయతీలో 20 ఎకరాల్లో జీన్స్ పరిశ్రమ ఏర్పాటు చేసి సుమారు నాలుగు వేల మంది మహిళలకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అమడగూరులో రిలయన్స్ సంస్థ సహకారంతో సుమారు రూ.51 వేల కోట్ల పెట్టుబడితో భారీ సౌర విద్యుత్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. ఈ పరిశ్రమల ద్వారా సుమారు 20 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పరిశ్రమలతో పాటు మౌలిక వసతులు, తాగునీరు, రహదారులు, మురుగునీటి కాలువలు, ఆరోగ్యం, క్రీడా రంగాల్లో చేపడుతున్న పనులతో నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నాయని నాయకులు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రజలను కోరారు. అభివృద్ధి కార్యక్రమాల కొనసాగింపుపై ప్రజలు తమ నిర్ణయం తీసుకోవాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# సి బెళగల్ మండల ప్రత్యేక అధికారిగా కే. శ్రీనివాసులు



**సి.బెళగల్ సెప్టెంబర్ 24 మనం న్యూస్:** సి.బెళగల్ మండలంలో గురువారంనాడు మండల ప్రత్యేక అధికారిగా కె శ్రీనివాసులు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు ముందుగా ప్రత్యేక అధికారికి మండల పరిషత్ అధికారులు ఎంపీడీవో రాణమ్మ మేడం గారు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు అనంతరం ఆయన అధికారుల మధ్య సి.బిలగల్ మండల ప్రత్యేక అధికారిగా బాధితులను స్వీకరించారు అనంతరం మండల అభివృద్ధి అధికారి చే పలుఅభివృద్ధి పనులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు ఈ సమావేశంలో ముఖ్యంగా గ్రామాలలో నీటి సమస్యల పైన ప్రతి ఒక్కరు సంబంధిత కార్యదర్శులు గ్రామాలలో ఉండి నీటి సమస్యను తలెత్తకుండా చూడాలని ఆయన తెలిపారు అనంతరం ముఖ్యంగా ప్రజలు సమస్య లను ప్రతి సోమవారము నిర్వహించే పీజీఆర్ఎస్ లో ఏవైనా సమస్యలు వస్తే ఎప్పటికప్పుడు ఆ సమస్యలపై దృష్టి పెట్టాలని ఆయన తెలిపారు.

# ప్రతి కుటుంబానికి సొంతింటి కల సాకారమే లక్ష్యం



**బేతంచేర్ల, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** పేద మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా అర్హత కలిగిన 161 మంది లబ్ధిదారులకు నూతన గృహాల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు గృహాల మంజూరు పత్రాలను అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సొంతింటి కల నెరవేరుతున్న 161 కుటుంబాలకు ఎమ్మెల్యే మంజూరైన గృహాలను నాణ్యతతో వేగంగా నిర్మించుకునేలా అధికారులు లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు ప్రజా సంక్షేమం అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు గృహాలు మంజూరైన లబ్ధిదారులు ఎమ్మెల్యే కోట్లకు కృతజ్ఞత తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నాగమణి, ఎంపీడీవో ఫజల్ రెహమాన్, నగర కమిషనర్ హరిప్రసాద్, హౌసింగ్ డిఇ ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయండి

**కర్నూలు, సెప్టెంబర్ 24మనం న్యూస్:** అక్టోబర్ 3వ తేదీన కర్నూల్ నగరంలో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ కర్నూలు జిల్లా నిర్మాణ మహాసభను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు, శ్రీనివాసులు పిలుపునిచ్చారు గురువారం నాడు స్థానిక సిఆర్ భవన్ నందు నిర్మాణ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు ఈ సందర్భంగా శ్రీరాములు శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నాయి తప్ప నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు కూటమి ప్రభుత్వం




తాను అధికారంలోకి వస్తే రాష్ట్రంలో సంపద సృష్టించి 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, అలా చేయలేని పక్షంలో నెలకు 3,000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాలు గడుస్తా ఉన్న ఇచ్చిన మాట నిలబెట్టుకో లేదన్నారు. ఈ మహాసభల్లో అధిక సంఖ్యలో యువతి పాల్గొని విజయవంతం చేయాలని వారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నాగరాజు చంటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డిఓకు వినతి పత్రం అందజేసిన విఆర్ఏలు



**జూపాడుబంగ్లా, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** జూపాడుబంగ్లా మండలంలోని తాసిల్దార్ కార్యాలయం నందు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గత తొమ్మిది రోజులుగా సహాయ నిరాకరణ సమ్మె నిర్వహిస్తున్న జూపాడు బంగ్లా మండలం గ్రామ రెవెన్యూ సహాయకులు తమకున్న డిమాండ్స్ వి ఆర్ ఏ పెస్కేల్ ఇవ్వాలని. అర్హులైన విఆర్ఏలకు ప్రమోషన్ కల్పించాలని. నామిని గా పని చేస్తున్న వారికి వీ ఆర్ ఏ లుగా తీసుకోవాలని. కారుణ్య నియామకాలు చేపట్టాలని. 2019 సంవత్సరంలో బకాయిలుగా ఉన్న డీఏలు చెల్లించాలని. రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకట శివ,కు వారి విన్నపాలను విన్నవించుకొని ఇప్పటికైనా మా సమస్యలు తమరి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి చేరవేసి వారి సమస్యలు పరిష్కరించటానికి సహకరించాలని.ఆర్ డి ఓ కు వినతి పత్రం అందజేశారు. ఆ ర్డి ఓ వెంకట శివ, స్పందిస్తూ వి ఆర్ ఏ ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జి మల్లికార్జునుడు, ఉపాధ్యక్షులు ఎల్ల నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం రమణ, కోశాధికారి ఎన్ ఆంజనేయులు, సహాయ కార్యదర్శి టి కాసిం, సీలార్ సాహెబ్, మౌలాలి, రసూల్, పక్కిర్ సాహెబ్, టీ జగదీష్, పి శ్రీనివాసులు, సుబ్బారావు, ముంతాజ్, షాహిన్ బి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు అధికారులు పరిష్కరించాలి

## మండలాధికారులకు ఆదేశాలు జారీచేసిన ఎమ్మెల్యే కోట్ల



**బేతంచేర్ల, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం పట్టణంలోని ఉన్న ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు ఈ సందర్భంగా పట్టణ మండలం ప్రజలు నీటి సరఫరా రోడ్లు పింఛన్లు విద్యుత్ ఆరోగ్య సదుపాయాలు వంటి ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే కి వివరించారు. ఎమ్మెల్యే ప్రతి వినతిని పరిశీలించి సంబంధిత శాఖాధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు ప్రజలు ఎప్పుడైనా తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచిస్తూ వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వైసిపి నాయకులు



**మహానంది, సెప్టెంబర్24,మనంన్యూస్:** మహానంది మండలంలోని గాజులపల్లి ఆర్ ఎస్ గ్రామానికి చెందిన కిరణ్ కుటుంబ సభ్యులను వైఎస్ ఆర్ సిపి నాయకులు శిల్పా భువనేశ్వర రెడ్డి గురువారం పరామర్శించారు. గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో అకస్మాత్తుగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.స్థానిక వైఎస్ ఆర్ సిపి నాయకులు పుల్లయ్య యాదవ్ ద్వారా విషయం తెలుసుకున్న ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట గ్రామ వైసీపీ నాయకులు శేషులు, దినేష్, తదితరులు వున్నారు.

# ప్రత్యేక అధికారిగా ఎస్. బషీర్ ఉన్నిసా బాధ్యతల స్వీకరణ



**బేతంచేర్ల, సెప్టెంబర్ 24 (మనం న్యూస్):** ప్రజా ప్రతినిధులైన మండలం అధ్యక్షుడు ఎంపీటీసీ వారి పదవి 23 కి ముగియడంతో బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా ఎస్. బషీర్ ఉన్నిసా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు అనంతరం ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ప్రత్యేక అధికారిని మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మండల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు పరిపాలనా వ్యవహారాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని ప్రత్యేక అధికారి ఎస్. బషీర్ ఉన్నిసా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల మండల ప్రజా పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మీరా..మిలమిల

- ఆసియా క్రీడల్లో సత్తా చాటిన చాను
- నగోయా



మీరాబాయి చాను కల నెరవేరింది.. భారత కరవు తీరిపోయింది..! ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్ షిప్ లో పతకాలు అందుకున్నా.. అందని ద్రాక్షలా ఊరిస్తున్న ఆసియా క్రీడల పతకాన్ని స్టార్ లిఫ్టర్ మీరా ఎట్టకేలకు ఒడిసిపట్టింది. బంగారు అంచనాలతో బరిలో దిగిన ఈ మణిపురి అమ్మాయి రజతంతో మెరిసింది. 28 ఏళ్ల సుదీర్ఘ విరామానంతరం ఆసియా క్రీడల వెయిట్ లిఫ్టింగ్ లో భారత్ కు లభించిన పతకం ఇది. బుధవారం మొత్తం అయిదు పతకాలు మన ఖాతాలో చేరాయి. షూటింగ్ లో పురుషులు, మహిళల జట్లు కాంస్యాలు గెలవగా.. బ్యాడ్మింటన్లో పురుషుల జట్టుకు, సాఫ్ట్ టెన్నిస్లో జయ్ మీనాలకు కాంస్యాలు దక్కాయి.

స్టార్ వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను అదరగొట్టింది. ఆసియా క్రీడల్లో తొలిసారి పతకం గెలుచుకుంది. 49కేజీల విభాగంలో ఆమె బుధవారం రజతం సాధించింది. చాను 198 కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచింది. ఆమె స్నాచ్ లో 87 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ లో 111 కిలోలు లేపింది. మల్లీశ్వరి (1998) తర్వాత ఏషియాడ్ లో పతకం గెలిచిన భారత తొలి వెయిట్ లిఫ్టర్ గా చాను ఘనత సాధించింది. ఉత్తర కొరియాకు చెందిన రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్ రి సొంగ్ గమ్ 215 (94+ 121కేజీ) కిలోలు లేపి, స్వర్ణం గెలుచుకుంది. ఆసియా క్రీడల్లో ఆమెకిది హ్యాట్రిక్ టైటిల్. పసిడి గెలిచే క్రమంలో రి.. స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్, టోటల్ లో ప్రపంచ రికార్డులు బద్దలు కొట్టింది. ఇండోనేసియా అమ్మాయి లులుక్ డియానా త్రి విజయానా 191 (88కేజీ+103కేజీ) కిలోలతో కాంస్య పతకం గెలుచుకుంది. టోక్యో ఒలింపిక్స్ లో రజతం గెలిచిన చాను.. ఇప్పుడు ఏషియాడ్ లో ఆత్మవిశ్వాసంతో సాగింది. స్నాచ్ లో 83 కిలోలతో మొదలెట్టిన ఆమె.. రెండో ప్రయత్నంలో 85 కిలోలు లేపింది. చివరిదైన మూడో ప్రయత్నంలో అత్యుత్తమంగా 87 కేజీలు లేపిన ఆమె.. పోటీలో మొదటి అర్ధభాగాన్ని మూడో స్థానంతో ముగించింది. క్లీన్ అండ్ జెర్క్ లో వరుసగా 107, 111 కిలోలు ఎత్తిన చాను, మూడో ప్రయత్నం చేయలేదు. ఇక 53 కిలోల విభాగంలో జ్ఞానేశ్వరి యాదవ్ ఎనిమిదో స్థానంలో నిలిచింది. మొత్తం 195 (87కేజీ+108కేజీ) కిలోలు ఎత్తింది. గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో ఆమె ఎత్తిన బరువు (199కేజీ) కంటే ఇది నాలుగు కిలోలు తక్కువ.



## చివరి నిమిషంలో జట్టులోకి వచ్చి.. రజతంతో మెరిసి..!

ఆసియా క్రీడల్లో భారత పతకాల వేట కొనసాగుతోంది. వుషు 60 కిలోల విభాగంలో మన అథ్లెట్ రోషిబినా దేవి రజతం దక్కించుకుంది. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో చైనా అథ్లెట్ జాంగ్ షియావు చేతిలో 0-2తో ఓటమి పాలైన రోషిబినా రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే, ఈ టోర్నీకి చివరి నిమిషంలో ఎంపికైన రోషిబినా.. రజతంతో మెరవడం విశేషం.

మణిపూర్ కు చెందిన రోషిబినా 2018లో జరిగిన ఆసియా క్రీడల్లో కాంస్యం సాధించింది. ఆ తర్వాత 2021లో జరిగిన ఇదే పోటీల్లో రజతం సొంతం చేసుకుంది. ఈసారి కూడా సిల్వర్ మెడల్ సాధించి.. ఆసియా క్రీడల్లో హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసింది. వాస్తవానికి ఈ ఏడాది ఆసియా క్రీడలకు ముందు నిర్వహించిన ట్రయల్స్ లో దివ్యాంశి చౌదరి చేతిలో రోషిబినా ఓటమిపాలైంది. దీంతో జట్టులో చోటు దక్కలేదు. కానీ, దివ్యాంశికి గాయం కావడంతో చివరి నిమిషంలో జాతీయ ఫెడరేషన్ సెలెక్టర్లు రోషిబినాను ఎంపిక చేశారు. వారి నిర్ణయం సరైందేనని ఆమె పతకంతో నిరూపించింది.

### రోయింగ్ లో కాంస్యం..

రోయింగ్ లో పురుషుల డబుల్స్ విభాగంలో భారత అథ్లెట్లు సత్నాం సింగ్, సల్మాన్ ఖాన్ కాంస్యం సాధించారు. మొదటి 1500 మీటర్ల వరకు రెండో స్థానంలో సాగిన భారత ద్వయం.. ఆఖరి 500 మీటర్ల పోటీలో మూడో స్థానానికి పడిపోయింది. దీంతో కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ పోటీల్లో చైనా జోడీ స్వర్ణం సాధించగా.. ఉజ్బెకిస్థాన్ ద్వయానికి రజతం దక్కింది.

## కీలకదశకు చేరుకున్న 'వారణాసి'.. మహేశ్ బాబు న్యూ లుక్ పోస్ట్ వైరల్



సూపర్ స్టార్ మహేశ్ బాబు హీరోగా దర్శకధీరుడు ఖిఖి రాజమౌళి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న చిత్రం 'వారణాసి'. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ కీలక దశకు చేరుకుంది. దాదాపు రెండేళ్లుగా వారణాసి చిత్రానికే అంకితమైపోయిన మహేశ్ బాబు తన పాత్ర షూటింగ్ ను చిత్రంలో ఇంట్రడక్షన్ సీన్లో వచ్చే షాట్ తో తాజాగా ముగించారు. షూటింగ్ పూర్తి చేయడంతో పాటు ఇప్పటికే డబ్బింగ్ ను కూడా ప్రారంభించినట్లు సమాచారం. 90%కు పైగా షూటింగ్ పూర్తవగా, మిగిలిన ప్యాచ్ వర్క్ ను వారణాసిలో పూర్తి చేసి షూటింగ్ కు గుమ్మడికాయ కొట్టేందుకు టీమ్ సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు నెట్టింట వైరల్ అవుతుండగా.. మహేశ్ బాబు ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. ఇక షూటింగ్ ముగింపు దశకు చేరుకోవడంతో VFX, ఎడిటింగ్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వంటి పోస్ట్ ప్రొడక్షన్ పనులపై రాజమౌళి ఫోకస్ పెట్టనున్నారు. కాగా.. సైన్స్ ఫిక్షన్ అండ్ హిందూ మైథాలజీ కలగలిపిన గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్ గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ పాత్ర పోషిస్తున్నాడు. ఎం.ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నాడు. ప్రపంచస్థాయి విజువల్స్ తో వారణాసి చిత్రం ఏప్రిల్ 7, 2027న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

## విరాట్-రోహిత్.. 2027 ప్రపంచకప్ గెలవాలి: రింకు సింగ్



వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్లో స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడుతారా? అనే దానిపై కొంతకాలంగా చర్చ జరుగుతూనే ఉంది. ప్రతిష్ఠాత్మక టోర్నీకి వీరిని విస్మరించొద్దని కొందరు సూచిస్తుండగా.. యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. దీంతో రోహిత్-విరాట్ భవిష్యత్తుపై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో టీమ్ఇండియా బ్యాటర్ రింకు సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విరాట్-రోహిత్ కలిసి 2027 వన్డే ప్రపంచకప్ నెగ్గితే చూడాలని ఉందని ఆకాంక్షించాడు. ''విరాట్ భాయ్, రోహిత్ భాయ్.. ఇద్దరూ లెజెండ్స్. వీరు ప్రపంచకప్లో ఆడాలని, ట్రోఫీ గెలుచుకునే జట్టులో భాగంగా ఉండాలని నేను మాత్రమే కాదు.. యావత్ దేశం ఆశిస్తోంది. అదే జరిగితే దేశం మొత్తానికీ అదో గొప్ప క్షణం అవుతుంది. ఎందుకంటే ఇదే వారికి చివరి ప్రపంచకప్ కావొచ్చు. ఇక, మనం చాలా కాలంగా వన్డే ప్రపంచ కప్ ను అందుకోలేదు. చివరిసారిగా 2011లో జరిగిన మెగా టోర్నీలో విజయం సాధించాం. ఇప్పుడు గెలిస్తే రోహిత్-విరాట్కి కూడా గొప్పగా ఉంటుంది. అందువల్ల వీరిద్దరూ జట్టులో ఉండి, దేశానికి ట్రోఫీ అందిస్తారని ఆశిస్తున్నా'' అని రింకు వ్యాఖ్యానించాడు.

## అతడు నాకు సొంతమైనా క్రష్ తగ్గట్లేదు: రష్మిక



విజయ్ దేవరకొండ, రష్మిక వైవాహిక బంధంలోకి అడుగుపెట్టిన తరువాత తొలిసారి జంటగా నటిస్తున్న చిత్రం 'రణబాలి'. సింగనమల బొబ్బిలి రణబాలిగా విజయ్ దేవరకొండ పవర్ ఫుల్ పాత్రను పోషిస్తుండగా, ఆయన భార్యగా జయమ్మ పాత్రలో రష్మిక కనిపించనున్నారు. ఈ సినిమాలోని ఇప్పటికే విడుదల చేసిన 'ఏందయ్యా సామీ..' పాటకు మంచి స్పందన వస్తోంది. అందులో విజయ్, రష్మికల మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంటోంది. తాజాగా ఆ పాట క్లిప్ ను రష్మిక ఇన్ స్టా లో పంచుకుంటూ, విజయ్ పై తన ప్రేమను వ్యక్తం చేయడం విశేషం.

''అతడు పూర్తిగా నాకే సొంతమయ్యాడు. కానీ తనపై క్రష్ ఏమాత్రం తగ్గడం లేదు. ఇదేం విచిత్రమో'' అని రష్మిక పోస్ట్ చేయగా, విజయ్ దీనికి తనదైన శైలిలో రిప్లై ఇచ్చారు. ''నేను ఎంతో అదృష్టవంతుడిని. జయమ్మను మిస్ అవుతాను కానీ, నువ్వు జీవితాంతం నా దగ్గరే ఉంటావు'' అని విజయ్ స్పందించారు. వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం చూసి నెటిజన్లు ముచ్చటపడుతున్నారు. ఇదిలా ఉండగా, రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కిస్తున్న 'రణబాలి' దసరా కానుకగా అక్టోబరు 16న విడుదల కానుంది.

## అక్టోబర్‌లో సెట్స్ పైకి.. పూజా కార్యక్రమాలకు టైమ్ ఫిక్స్ చేసుకున్న RC17!

బాక్సాఫీస్ సంచలన హిట్ 'రంగస్థలం' తర్వాత గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్ మరోసారి జతకట్టబోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం 'RC17' పేరుతో అనౌన్స్ మెంట్



వచ్చిన ఈ ప్రాజెక్టుపై ప్రేక్షకుల్లో భారీ హైప్ క్రియేట్ అయ్యింది. ఈ క్రమంలోనే ఇందులో నుంచి వచ్చే అప్డేట్స్ కోసం ఎంతో ఈగర్ గా వెయిట్ చేస్తుండగా.. తాజాగా ఈ ఎపిక్ డ్రామాకు సంబంధించిన షూటింగ్ అప్డేట్ వచ్చింది. డైరెక్టర్ సుకుమార్ ఈ చిత్రానికి సంబంధించిన పవర్ఫుల్ స్క్రిప్ట్ వర్క్ ను పూర్తి చేశారట. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో వేగం పెంచిన చిత్ర బృందం.. అక్టోబర్ 20న హైదరాబాద్ లో ఈ చిత్రానికి సంబంధించిన గ్రాండ్ లాంచ్, పూజా కార్యక్రమం జరిపేందుకు సిద్ధం అయ్యారట. అంతే కాకుండా త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల నుంచి సమాచారం. కాగా.. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ ఎక్కడ రాజీ పడకుండా భారీ నిర్మాణ విలువలతో ఎంతో ప్రతిష్టాత్మంగా ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించబోతున్నాయి.

## నా కారు డ్రైవర్, వాచ్ మన్ పదేపదే ఆ వీడియో చూశారు




బోల్ పాత్రలు, బోల్ కామెంట్స్ తో ఎప్పటికప్పుడు వార్తల్లో నిలిచే బ్యూటీ రాధిక ఆప్టే. లెజెండ్, లయన్ తదితర తెలుగు సినిమాల్లోనూ హీరోయిన్ చేసిన ఈమె.. తర్వాత పూర్తిగా హిందీకే పరిమితమైంది. రీసెంట్ టైంలో ఈమె 'లస్ట్ స్టోరీస్ 3' సిరీస్ లో నటించింది. దీని ప్రమోషన్లలో భాగంగా తనకు గతంలో ఎదురైన చేదు అనుభవాన్ని పంచుకుంది. తన ఇంటిమేట్ సీన్ లీకైన కారణంగా నరకం అనుభవించానని చెప్పుకొచ్చింది.

'ఓసారి నేను నటించిన ఇంటిమేట్ సీన్ లీక్ కావడంతో నాలుగురోజుల పాటు ఇంటి గుమ్మం దాటలేకపోయాను. ఇరుగుపొరుగు వాళ్లు నా వీడియో చూస్తున్నారని తెలిసి నరకం అనుభవించాను. నా కారు డ్రైవర్, ఇంటి వాచ్ మన్ పదేపదే ఆ వీడియో చూశారు. నేను చేసిన సీన్ చూసిన బయటవాళ్లు ఎక్కడ నా ఇంటికి వచ్చేస్తారోనని భయపడ్డాను. ఆ అనుభవం భద్రత విషయంలో నన్ను భయపెట్టింది. ఈ వీడియోలో నటించిన టైంలో ఒంటరిగా నివసిస్తుండడంతో నా డ్రైవర్, నా వ్యక్తిగత సిబ్బందితో మాట్లాడాలని నిర్ణయించుకున్నాను. వాళ్లకు ఫోన్ చేసి పరిస్థితి వివరించాను. ఆ క్లిప్ చూశారా? ఒకవేళ చూసినా మీరు నాతో కలిసి పనిచేయడానికి రెడీగా ఉంటేనే రండి అని చెప్పాను. నా పరిస్థితి అర్థం చేసుకున్న వాళ్లు నాకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు'

'అలానే ఓసారి యాక్షన్ సీన్ చేసేటప్పుడు షర్ట్ గుండీలు తీసి నటిస్తారా? అని నన్ను అడిగారు. యాక్షన్ సీక్వెన్స్లో శరీరాన్ని వేగంగా కదిలిస్తాం కాబట్టి కుదరదని చెప్పాను. అయినా సరే ఆ వ్యక్తి నన్ను వినిపించుకోకుండా కనీసం లో దుస్తులైన ధరించి ఆ సీన్ చేయమని ఒప్పించే ప్రయత్నం చేశాడు. నేను ఒప్పుకోలేదు. సినిమాని హిట్ చేయడం కోసం మహిళలని వారి పరిధి దాటేలా ఒత్తిడి చేయడం కరెక్టా?' అని రాధిక ఆప్టే ఆవేదన వ్యక్తం చేసింది.

## వైల్డ్‌గా రణబీర్ కపూర్ ఫస్ట్ లుక్



సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హై-ప్రొఫైల్ ఎంటర్ టైనర్ 'లవ్ అండ్ వార్'. బాలీవుడ్ క్యూట్ కపుల్ రణబీర్ కపూర్, అలియా భట్ జంటగా, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం నుంచి తాజాగా అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు మేకర్స్. లవ్ అండ్ వార్ చిత్రం వచ్చే ఏడాది జనవరి 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతున్నట్లు తెలుపుతూ.. రణబీర్ ఫస్ట్ లుక్ పోస్టర్ ను విడుదల చేశారు. ఇందులో రణబీర్ వింటేజ్ కార్ డ్రైవ్ చేస్తూ, వైట్ టీషర్ట్, గ్లాసెస్, షార్ట్ బజ్ కట్తో కనిపిస్తున్న రణబీర్ లుక్ సింపుల్ గా ఉన్నా.. రక్తంతో గాయపడిన చేతిని మాత్రం హైలెట్ గా చూపిస్తూ క్యూరియాసిటీ పెంచేశారు టీమ్. కాగా.. ఈ సినిమాకు సంబంధించిన ప్రధాన షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. అయితే వార్ సీక్వెన్ల కోసం రణ్బీర్, అలియా, విక్కీతో అదనపు షూట్ జరిగినట్లు కూడా తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన మరో విశేషం ఏంటంటే.. లవ్ అండ్ వార్ ఇంకా థియేటర్లోకి రాకముందుకే ఈ సినిమా ఖీఖీ హక్కులు నెట్ ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకుంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.